ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



తూర్పుగోదావరి

జిల్లా వార్తలు

గురువారం 6 నవంబరు 2025 | 5

అన్నవరం వద్ద హైవేపై గిరి ప్రదక్షిణ వ్యూ.. పిల్లాడితో కలిసి ప్రదక్షిణ..







కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద ఉన్న భారీ శివలింగం మీదుగా కనిపించిన సూపర్ మూన్.. గోదావరి పుష్కర ఘాట్‌లో పౌర్ణమి స్నానాలు.. పుష్కర ఘాట్‌లో గోదావరికి కార్తీక పౌర్ణమి హారతి



కనుల పండువగా..

కార్తీక దీపోత్సవం

- గోదావరి ఘాట్లలో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు
- కిక్కిరిసిన పంచారామాలు

అత్యంత పవిత్రంగా భావించే కార్తీక మాసంలో పౌర్ణమి విశిష్టత అందరికీ తెలిసిందే. శుక్ల పక్షంలో పున్నమి తిథి కలిగిన ఈ పదిహేనో రోజును హరి, హరులకు ప్రీతికరమైందని భక్తుల విశ్వాసం. ఈసారి కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తులు వేకువజామునే స్నానాదులు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోదావరి, కాలువలు, పుష్కరిణిల్లో దీపాలు వదిలారు. నోములు ఉన్నారు. రాత్రికి అనేక చోట్ల జ్వాలాతోరణం కార్యక్రమాలు నిర్వహించారు. పంచారామాలతోపాటు కోటిపల్లి, రాజమహేంద్రవరం గోదావరి, అన్నవరం, పిఠాపురం ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాల వద్ద కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. 6




పెరవలిలో 'చంద్ర'కాంతులు



పుష్కర ఘాట్‌లో దీపారాధన

జై సత్యదేవా..

అన్నవరంలో గిరిప్రదక్షిణ





- స్వామి నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- కనుల పండువగా గిరి ప్రదక్షిణ
- రెండు లక్షల మంది హాజరు
- ఘనంగా పంపా హారతులు, జ్వాలాతోరణం



పంపానదికి కార్తీక పౌర్ణమి హారతి

7



పర్యాటకం పరుగు



- ప్రకృతి ఒడిలో విహారం.. వినోదం..
- కేరళ తరహాలో ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ముందడుగు
- టెండర్లు పిలిచిన పర్యాటక శాఖ
- ఇప్పటికే కేరళ టూరిజం బృందాల పరిశీలన
- తూర్పు, కోనసీమల్లో హౌస్‌బోట్లు.. కాకినాడ బీచ్ పర్యాటకం.. ఏజెన్సీలో ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రకృతి వనరులను ఒడిసి పట్టుకొని పర్యాటకపరంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వ చొరవతో పర్యాటక శాఖ పరుగు పెడుతోంది. ఇప్పటికే ఎక్కడికక్కడ పర్యాటకులకు ఏర్పాట్లు ఉన్నా.. వాటిని మరింత మెరుగ్గా ఆధునిక ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. మధురపూడి విమానాశ్రయంలోని రెండో టెర్మినల్ శరవేగంగా నిర్మాణం జరుగుతోంది. రైలు ప్రయాణికులకు గేట్‌వేగా రాజమహేంద్రవరం ఉంది. పర్యాటకుల సునాయాస ప్రయాణానికి మరింత కూడలిగా అవతరించనుంది. ఇక కోనసీమ అందాలు కేరళను తలపిస్తాయి. కాకినాడ బీచ్ విదేశాల్లో విహరించిన అనుభూతి కలిగిస్తుంది. మరోవైపు మారేడుమిల్లి ఏజెన్సీ అందాలను ఆస్వాదించడానికి ఇప్పటికే పర్యాటకులు క్యూకట్టారు. ఆధ్యాత్మిక టూరిజం సరేసరి. ఇప్పుడు వీటన్నిటినీ వినియోగించుకొని పర్యాటక సర్క్యూట్‌గా పుష్కరాల నాటికి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం వేగంగా జరుగుతోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే గోదావరి పర్యాటకానికి మహర్దశ పట్టినట్టే.

● అలెప్పీ వెళ్లక్కర్లే..

హౌస్‌బోట్లకు కేరళలో అలెప్పీ(అళప్పుజ) ప్రసిద్ధి. ఇకపై అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఆ అనుభూతిని ఇక్కడే ఆస్వాదించొచ్చు. గోదావరి, వేమగిరి-ధవళేశ్వరం కాలువ, కొవ్వూరు పరీవాహక ప్రాంతాల్లో హౌస్‌బోట్ల ఏర్పాటుకు పర్యాటకశాఖ టెండర్లు పిలిచింది. కేరళకు చెందిన టూరిజం సంస్థల ప్రతినిధులు ఇప్పటికే ఇక్కడ ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్థానికంగా ఆపరేటర్లు ఉంటే వాళ్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేరళ, బెంగళూరు వంటి ప్రాంతాల్లోని పెద్ద ఆపరేటర్లతో కలిసి పనిచేసినా స్థానికంగా మేలు జరుగుతుంది. హౌస్‌బోట్లు సింగిల్ రూమ్ లేదా డబుల్ రూమ్ విధానంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పగటిపూట మాత్రమే నడుపుతారు. టూరిజం పాలసీ ప్రకారం రాయితీలు ఉంటాయి. ఇరిగేషన్ తదితర అనుమతులకు టూరిజం శాఖ సహాయ పడుతుంది. హౌస్‌బోట్లలో ఫుడ్ సదుపాయమూ ఉంటుంది. బోటుకు సుమారు రూ.30 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఆయా సంస్థలు, అవి అందించే సదుపాయాలకు అనుగుణంగా ధరలను నిర్ణయిస్తారు. ఒక్కో బోటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50మందికి ఉపాధి లభిస్తుంది.

● జల క్రీడలు..

కడియం, నిడదవోలు కాలువలు, గోదావరి లంకల్లో జల, సాహస క్రీడల టూరిజానికి ప్లాన్ చేశారు. జిప్‌లైనర్, ఎయిర్ బెలూన్స్, లాంగ్ జంప్‌లు, స్కూబా డ్రైవ్, రోప్ వే, స్పీడ్ బోట్లు వంటివన్నీ వస్తాయి. గోదావరి లోతు పుష్కర్ ఘాట్ నుంచి సరస్వతీ ఘాట్ వరకూ 30 అడుగుల లోతు ఉంటుంది. అందువల్ల హౌస్‌బోట్లు, అడ్వంచర్ పర్యాటకానికి అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు ఇసుకపై వెళ్లే వాహనాలు కేటీఎం వాహనాల వంటివి కూడా తీసుకొస్తారు. ఇసుక తిన్నెల్లో టెంట్‌లతో వసతి ఏర్పాటు చేస్తారు. హేవలాక్ బ్రిడ్జి(పాత రైలు వంతెన)ని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రైల్వేకు డబ్బు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే తర్వాత ప్రక్రియ ఆలస్యం కావడం, ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చా కేంద్ర ప్రభుత్వం రూ.46 కోట్లు మంజూరు చేసింది. హేవలాక్ బ్రిడ్జిపై బ్యూటిఫికేషన్, అటూ ఇటూ షావనీర్ షాప్స్, ఫుడ్ ఐటమ్స్ వంటివన్నీ వస్తాయి. ప్రతి స్తంభం దగ్గర రౌండ్ సర్కిల్‌ని కడతారు. అక్కడ కూర్చుని గోదావరి గాలిని ఆస్వాదించొచ్చు. ఈ వంతెనపై ఉండే నడకదారిపై నడిచి వెళ్లి బ్రిడ్జిలంకలో దిగి అక్కడి నుంచి బోటులో పుష్కర్‌ఘాట్ చేరుకొనేలా ప్లాన్ చేశారు. అయితే బ్రిడ్జికి సంబంధించి పుష్కర్‌ఘాట్ వద్ద ప్రవేశంలో 1044 చదరపు మీటర్ల స్థలం రైల్వే నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉంది. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించడంతో త్వరలోనే ఆ పని కూడా పూర్తి అయ్యే అవకాశం ఉంది.

కోనసీమ, కాకినాడల్లో...

కాకినాడలో ప్రత్యేకంగా బీచ్‌లను అభివృద్ధి చేసి బీచ్ టూరిజాన్ని మెరుగుపరుస్తారు. బీచ్ వాలీబాల్, స్నైలాంతర్లు వంటివి ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలోని దిండి, పాశర్లపూడి బ్యాక్ వాటర్స్, అప్పనపల్లి దగ్గర, యానాం, గోగుల్లంక ఫెర్రీల్లో హౌస్‌బోట్లు, వసతి ఏర్పాటుచేస్తారు. ఏజెన్సీకి సంబంధించి రంపచోడవరం, మారేడుమిల్లిలో ట్రెక్కింగ్, జంగిల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తారు. ఇప్పటికే మారేడుమిల్లిలో ఆ తరహా వసతులు కొంతవరకు ఉన్నాయి.

● ప్రతిపాదనలకు ఆహ్వానం

పర్యాటక అభివృద్ధి కోసం టూరిజం శాఖ ప్రతిపాదనలకు ఆహ్వానం పలికింది. ఆసక్తి ఉన్న వారు టూరిజం వెబ్‌సైటులో బిడ్లను పరిశీలించవచ్చు. జలక్రీడలు, సాహస క్రీడలు, లగ్జరీ హౌస్ బోట్లు, పార్టీ బోట్లు ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుంది. సంస్థలు, వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలు www.tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పర్యాటక అధికారులను 9505011951, 6309942025 నెంబర్లలో సంప్రదించవచ్చు.

● పుష్కరాల కంటే ముందే..




పర్యాటకపరంగా పుష్కరాల కంటే ముందుగానే ఓ రూపు తీసుకొచ్చి ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. స్థానికంగా కూడా ప్రాధాన్యం ఇస్తాం. పర్యాటకం అభివృద్ధి అయితే స్థానికులకు పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుంది. ఇక్కడి రుచులు, సంస్కృతి ప్రపంచానికి పరిచయం అవుతాయి. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆ దిశగా అభివృద్ధికి కృషి చేస్తున్నాం. - పి.వెంకటాచలం, జిల్లా పర్యాటక అధికారి, తూర్పుగోదావరి

హోమ్‌స్టేలతో పర్యాటకులకు కొత్త అనుభూతి : కోనసీమ కలెక్టర్



అయినవిల్లిలో రిసార్ట్స్‌ను పరిశీలిస్తున్న కోనసీమ కలెక్టర్

అమలాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోమ్ స్టే విధానం వల్ల పర్యాటక రంగంలో స్థానిక ప్రజల జీవనశైలి, ఆచారాలు, సంప్రదాయాలు, వంటకాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పర్యాటకులు ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అయినవిల్లి, అల్లవరం మండలంలో కలెక్టర్ బుధవారం పర్యటించారు. అల్లవరం మండలం గూడాల గ్రామంలో పొల్లేటి సాయి మండవ ఇళ్లు, ముక్తేశ్వరం విళ్ల దొరబాబుకు చెందిన అయినవిల్లి కోనసీమ విల్లా రిసార్ట్స్ పురాతన మండువ లోగిళ్లను ఆయన సందర్శించి హోమ్‌స్టేకు అనువైన వసతులు ఏమేరకు ఉన్నదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్‌స్టే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఆ దిశగా కోనసీమలో ఉన్న పురాతన, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే మండువా లోగిళ్లను గుర్తించడం జరుగుతోందన్నారు. హోమ్‌స్టే ద్వారా స్థానిక ఆదాయ వృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ముఖ్యంగా పర్యాటకులు ఓ ప్రాంతంలోని అసలైన జీవన విధానాన్ని అనుభవిస్తారన్నారు. సాంస్కృతిక మార్పిడి, స్థానిక కళలు సంగీతం, నృత్యం, పండుగల విశిష్టతలను దగ్గరగా తెలుసుకోవచ్చన్నారు. సంప్రదాయాలపై పర్యాటకుల ఆసక్తి వల్ల స్థానికులు తమ సంస్కృతిని మరింత ఉత్సాహంగా కొనసాగించడానికి కారణమవుతుందన్నారు. అలాగే సాధారణ హోటల్ బసకు భిన్నంగా హోమ్‌స్టేలు నిజమైన స్థానిక అనుభూతిని అందిస్తాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదన్నారు. సుస్థిర పర్యాటకంతోపాటు ప్రకృతితో సఖ్యత కలిగిన పర్యావరణానికి హాని లేని రీతిలో పర్యాటకులు పూర్వపు సంప్రదాయ సాంస్కృతిక వారసత్వపు అనుభూతిని అందించడంలో ఒక సమర్థమైన సాధనమన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో కె.మాధవి, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ ఉన్నారు.



ట్రైన్‌లో మంటలు

విశాఖ-మహబూబ్‌నగర్ రైలు బ్రేకుల్లో మంటలు

- మెయిన్‌లో..

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

- మౌలిక సదుపాయాలను పూర్తిచేయాలి
- 'విద్యా శక్తి' కింద సృజనాత్మక శక్తిని పెంపొందించాలి
- సమీక్షలో కలెక్టర్ కీర్తి



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

రాజమహేంద్రవరం,నవంబరు5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను గుర్తించి వాటిని పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, వొకేషనల్, ఎస్ఎస్ఏ, మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, ఐసీడీఎస్ అంగన్వాడీలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో సృజనాత్మకశక్తి పెంచే విధంగా చదవడం, రాయడం సరిగా రాని విద్యార్థులకు 'విద్యాశక్తి' కార్యక్రమం కింద సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధన చేయాలన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ ఉండడానికి వీల్లేదన్నారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల ద్వారా పాఠశాలలకు రాని వలస పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పాలన్నారు. జిల్లాలో 1 నుంచి 12వ తరగతి వరకు ఇంకా 6 వేల మంది విద్యార్థులకు అపార్ ఐడీ లేదని, వారందరికీ తక్షణమే ఐడీలను క్రియేట్ చేయాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులు ప్రయోగాత్మకంగా అభ్యసించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. తల్లికి వందనం పథకం కింద సాంకేతిక కారణాల వల్ల నిధులు జమకాని లబ్ధిదారుల జాబితాను గ్రామ/వార్డు సచివాలయాలతో సమన్వయం చేసి సిద్ధంచేయాలన్నారు. ఆ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఇంకా ఇంటర్మీడియట్‌లో చేరని విద్యార్థులను గుర్తించి అందుకు కారణాలను వివరంగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచే ఐఐటీ శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. అవసరమైన పాఠశాల భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయలన్నారు. స్కూల్ గ్రాంట్స్ వినియోగం సక్రమంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకొనే ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సాహకాలను అందించాలన్నారు. నీట్, జేఈఈ మెయిన్స్‌కి సిద్ధం చేయాలన్నారు. ఇంటర్‌లో మెరుగైన ఫలితాల కోసం 69 మంది వొకేషనల్ టీచర్ల నియామకం ప్రక్రియ జరుగుతోందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. పీఎం షైనింగ్ రైజ్ ఆఫ్ ఇండియా పథకం కింద 26 పాఠశాలలకు అనుమతులు లభించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న వాటిని సమీప ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేసే విధానంలో మార్గదర్శకాలను అనుసరించి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్ఈవో వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ సుభాషిణి పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు

ఉమ్మడి జిల్లాలో నూతనంగా 60 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు 7



రాజమహేంద్రవరం జీజీహెచ్ సందర్శనలో భాగంగా వైద్యసేవల కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

క్యాజువాలిటీ నైట్ షిఫ్టుల్లో ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నైట్‌షిఫ్టుల్లో రాత్రిపూట విధులు నిర్వర్తించే వైద్యులు, ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలని, రోగులకు వైద్యసేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం చూపిస్తే చర్యలు తప్పవని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)ను సందర్శించిన ఆయన ఆసుపత్రి అధికారులతో మాట్లాడి రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ జీజీహెచ్‌లో 24 గంటలూ వైద్యసేవలు అందించాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని, అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రేడియాలజిస్ట్ పోస్టు భర్తీ చేసి సమస్య పరిష్కరించామని, న్యూరో విభాగంతోపాటు, ఎంఆర్ఐ విషయంలో కొంత ఇబ్బంది ఉందని, త్వరలోనే వాటిని కూడా సరిచేస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాకు భవనాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా జనవరిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే మార్చురీ నుంచి వచ్చే దుర్గంధం సమస్యకు శాశ్వత పరిష్కారం ఆలోచన చేస్తున్నామని, దీన్ని ఆధునీకరించి డీప్‌ఫ్రీజర్ వంటివి ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. వీటికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సీఎస్ఆర్ ఫండ్స్ సమీకరించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. తొలుత ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ పుష్పగుచ్ఛంతో స్వాగతించారు.

కార్తీక దీపోత్సవం

- ఆలయాల్లో భక్తి ప్రపత్తులతో కార్తీక పౌర్ణమి పూజలు
- దీపాలు వెలిగించి.. పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు
- వ్రతాలు, అభిషేకాలు, దర్శనాలతో కిక్కిరిసిన పుణ్యక్షేత్రాలు



రాజమహేంద్రవరం గోదావరిలో చిన్నారికి నదీస్నానం చేయిస్తున్న తల్లి.. అరటిదొప్పల్లో కార్తీక దీపారాధన చేసిన యువతులు


రాజమహేంద్రవరంలో అరటిదొప్పపై దీపం వెలిగించిన యువతి


రాజమహేంద్రవరం గోదావరిలో తెల్లవారుజామున పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో..

ద్రాక్షారామ,నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామభీమేశ్వరాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు విశేషసంఖ్యలో దర్శించుకున్నారు. తెల్లవారుజామునుంచి భక్తులు రాక ప్రారంభమైంది. క్యూలైన్ల ద్వారా భీమేశ్వరస్వామివారు, మాణిక్యాంబ అమ్మవార్లను దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.నవవధువులు స్వామివారికి పువ్వు, పిందె సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక అభిషేకాలు జరిపారు. అశ్వత్థనారాయణ వృక్షం చుట్టూ ప్రదక్షణలు చేశారు. ఉసిరిక చెట్టువద్ద నోములు ఆచరించిన మహిళలు రాత్రికి ఆలయంలో దీపాలు వెలిగించారు. ఆలయ ఈవో అల్లు వెంకటదుర్గాభవానీ పర్యవేక్షణలో సిబ్బంది సేవలందించారు. అన్నప్రసాద భవనంలోను, పైండావారి సత్రంలోను అన్నదానం నిర్వహించారు.


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న మహిళలు

సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో..

సామర్లకోట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం బుధవారం తెల్లవారుజామునుంచీ భక్తుల శివనామస్మరణలతో మార్మోగింది. ఆలయ ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు) ధర్మకర్తల మండలి సభ్యుల పర్యవేక్షణలో తెల్లవారుజామున గోపూజలు చేశారు. భీమేశ్వరస్వామిని పంచద్రవ్యాలతో అభిషేకించారు. బాలాత్రిపుర సుందరి అమ్మవారికి విశేష కుంకుమార్చన పూజలు చేశారు. అనంతరం స్వామి, అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించారు. కార్తీక నోములు కావడంతో భక్తులు ఉపవాసాలతో పూజలు చేశారు. మారేడు, జమ్మి, రావిచెట్టులవద్ద మహిళలు దీపాలను వెలిగించారు. నూతన వధువులు కంద పిలకలు, పసుపు పిలకలతో కూడిన స్వయంపాకాలను స్వామికి సమర్పించారు. అధికసంఖ్యలో జ్వాలాతోరణంలో భక్తులు పాల్గొన్నారు.


సామర్లకోట భీమేశ్వరాలయంలో విశేష అలంకరణలో స్వామి, అమ్మవార్లు


ద్రాక్షారామలో స్వామికి పువ్వు, పిందె సమర్పిస్తున్న నవవధువు


సామర్లకోటలో భీమేశ్వరుడికి కందపిలకల వాయినం సమర్పణకు వచ్చిన నూతన జంట


అన్నవరం కొండపై కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు


అన్నవరం పంపా తీరంలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


సామర్లకోట భీమేశ్వరాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


విద్యుత్‌కాంతుల వెలుగులో గొల్లప్రోలు మండలం దుర్గాడ శివాలయం


రాజమహేంద్రవరం గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న యువతులు

అన్నవరంలో 10వేల జంటల వ్రతాలు

అన్నవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అన్నవరంలో సత్యదేవుడి సన్నిధిలో బుధవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా రద్దీ నెలకొంది. మంగళవారం రాత్రికే రత్నగిరికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. అర్ధరాత్రి ఒంటిగంట నుంచి వ్రతాలు ప్రారంభించారు. మహిళలు రావిచెట్టు వద్ద కార్తీకదీపాలను వెలిగించి తమభక్తిని చాటుకున్నారు. పౌర్ణమి పర్వదినాన 10వేల జంటలు వ్రతాలు ఆచరించారు. వివిధ విభాగాల ద్వారా రూ.కోటి మేర ఆదాయం లభించింది. గిరిప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు సైతం తరలిరావడంతో ఆలయ ప్రాంగణమంతా కిక్కిరిసింది. భక్తులకు అసౌకర్యం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. రూ.1500 వ్రత మండపం సరిపడక ప్రత్యామ్నాయంగా ప్రధానాలయ గోపురం బయట టెంట్ వేసి వ్రతాలను నిర్వహించాలని నిర్ణయించారు. భక్తులు ధ్వజస్తంభం దగ్గర వ్రతాలు ఆచరించుకోవాలని వస్తే టెంట్‌వేసి ఏర్పాటు చేయడంపై అభ్యంతరం తెలపడంతో అధికారులు వాటిని నిలుపుదల చేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి రెండుగంటలు, ఉచిత దర్శనానికి మూడుగంటలు సమయం భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. రద్దీ అధికంగా ఉన్నంతసేపు అంత్రాలయ దర్శనం స్థానంలో శీఘ్రదర్శనానికి పరిమితం చేశారు. ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. కంపార్టుమెంట్‌లు ద్వారా మాత్రమే భక్తులను అనుమతించడంతో కొద్దిసమయం ఆలస్యమైనా అవాంచనీయ సంఘటనలు, తోపులాటలు జరగకుండా కార్తీక పౌర్ణమి రద్దీ ముగిసింది.


అన్నవరంలో రద్దీ కారణంగా క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

సంగమ క్షేత్రం.. భక్తజన సంద్రం


అంతర్వేది శివాలయం వద్ద జ్వాలా తోరణం

- ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- అంతర్వేదికి పోటెత్తిన భక్తులు
- సాగర తీరంలో పుణ్యస్నానాలు.. నీలకంఠుడికి అభిషేకాలు

అంతర్వేది, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సాగర సంగమ తీరం అంతర్వేది పుణ్యక్షేత్రంలో బ్రహ్మ ప్రతిష్ఠించిన పార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా వేకువజాము నుంచి భక్తులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నందీశ్వరుడు వద్ద దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. రామేశ్వరం కృత్య రామలింగేశ్వరస్వామి, మోరి, సఖినేటిపల్లి అంతర్వేది కొత్తవంతెనవద్ద ఉన్న శివాలయాల్లో భక్తులు కార్తీక పౌర్ణమి పూజలు చేశారు. అంతర్వేది శివాలయం వద్ద రాత్రి శివలింగం, ఓంకార ఆకారాలతో దీపాలను వెలిగించారు. అనంతరం వైభవంగా జ్వాలా తోరణం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి సందర్భంగా భక్తులు పోటెత్తారు.

పుణ్యస్నానాలు.. దీపోత్సవం

అంతర్వేది పుణ్యక్షేత్రం భక్తులతో కిటకిటలాడింది. బుధవారం వేకువజాము నుంచి భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామికి పంచామృతాలతో అభి షేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. సాయంత్రం వేంకటేశుడి గోవింద నామాలతో దీపాలంకరణ నిర్వహించారు. ఆలయ ఆవరణమంతా కార్తీక దీపాలతో కళకళలాడింది. ఈ సందర్భంగా పార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంవద్ద భక్తిశ్రద్ధలతో జ్వాలాతోరణం నిర్వ హించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను పల్లకిలో ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. పుణ్యక్షేత్రంలో అధికసంఖ్యలో భక్తులు దీపాలు వెలిగించారు.



అంతర్వేది శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


పల్లకిలో ఊరేగుతున్న శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి

వాడపల్లిలో జ్వాలా తోరణం

ఆత్రేయపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం వాడపల్లి అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామిఆలయంలో కార్తీకపౌర్ణమి సందర్భంగా బుధవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. శివునికి పంచామృతాభిషేకం, దీపాలంకరణ నిర్వహించారు. అనంతరం రాత్రి ఆలయం వద్ద జ్వాలాతోరణ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు. అనంతరం స్వామివారి గ్రామోత్సవం కన్నుల పండువగా జరిగింది. వివిధ గ్రామాల్లోని శివాలయాల వద్ద జ్వాలా తోరణం కార్యక్రమం భక్తజన శివనామస్మరణ నడుమ ఘనంగా నిర్వహించారు. కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి భక్తజనం పోటెత్తారు. గోదావరి నదీలో పుణ్యస్నానాలు ఆచ రించి దీపాలంకరణ చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరించారు.


వాడపల్లిలో జ్వాలా తోరణం

గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఏపీని నిలుపుతాం

డబ్ల్యూటీఎం-2025లో మంత్రి కందుల దుర్గేష్


లండన్‌లో డబ్ల్యూటీఎం-2025లో పాల్గొన్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ టూరిజం మ్యాప్‌లో ఆంధ్రప్రదేశ్‌ని సగర్వంగా నిలుపుతామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.లండన్‌లో జరుగుతున్న వరల్డ్ ట్రావెల్ మార్కెట్(డబ్ల్యూటీఎం)-2025లో పాల్గొని ఏపీలో పర్యాటక అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహం తదితర అంశాలను వినిపించామన్నారు. భారత పర్యాటక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన స్టాల్‌ను డిప్యూటీ హైకమిషనర్, వివిధ రాష్ట్రాల పర్యాటక మంత్రులతో కలిసి ఆయన ప్రారంభించారు. 20కిపైగా అంతర్జాతీయ టూర్ ఆపరేటర్లు, హోటళ్ల ప్రతినిధులు, ఫైస్ ఇన్వెస్టర్లు, ట్రావెల్ మ్యాగజైన్స్, మీడియా బ్లాగర్స్‌తో చర్చించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. రాష్ట్రంలో పర్యాటక రంగంలో పెట్టుబడుల అవకాశాలపై వివరణ ఇచ్చామన్నారు. ఏపీ స్టాల్ ద్వారా మన రాష్ట్రంలోని ప్రకృతి సహజసిద్ధ ప్రదేశాలు, చారిత్రాత్మక కోటలు, తీర ప్రాంతాలు, వారసత్వ సంపదపై ప్రచారం కల్పించామన్నారు.జీఐ ట్యాగ్ పొందిన ఏటికొప్పాక, కొండపల్లి బొమ్మలను ప్రదర్శించి వాటి ప్రత్యేకతలను, తయారీ విధానాన్ని వివరించామన్నారు. అనంతరం అంతర్జాతీయ మీడియాతో మాట్లాడుతూ నూతన పర్యాటక పాలసీని తెలియజేసి పెట్టుబడులను ఆహ్వానించామన్నారు.

రాష్ట్రస్థాయి సెపక్‌తక్రా పోటీలకు వర్షిణి ఎంపిక



అమలాపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఇందుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న తూటారపు వీవీ వర్షిణి జిల్లా స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో విజేతగా నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం లంక రాణి తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ ఈనెల 6,7,8 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా దేవరపల్లిలో జరిగే రాష్ట్ర సెపక్‌తక్రా పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. వర్షిణిని హెచ్‌ఎం రాణి, ఉపాధ్యాయులు, పీఈటీ బుజ్జి, సర్పంచ్ చొల్లంగి శివాలిని తదితరులు అభినందించారు.

శనేశ్వరస్వామికి వెండి ఝుటాజుటం బహూకరణ


వెండి ఝుటాజుటం బహూకరిస్తున్న దాత దంపతులు

కొత్తపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాలో ప్రసిద్ధి చెందిన మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామికి బుధవారం కడప జిల్లా పొద్దుటూరుకు చెందిన చిన్నే శ్రీనివాస్-లక్ష్మి దంపతులు కార్తీక పౌర్ణమి సందర్భంగా 3.18 కిలోల వెండి ఝుటాజుటాన్ని స్వామివారికి సమర్పించారు. ఈ మేరకు ఆలయ సహాయ కమిషనరు, ఈవో దారపురెడ్డి సురేష్‌బాబుకు ధర్మకర్తల మండలి సభ్యులు గ్రామపెద్దల సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా దాతలకు ఆలయార్చకులు వేదాశీర్వచనం అందించారు.కార్యక్రమంలో చింతం విజయకృష్ణమోహన్, ధరణాల రామకృష్ణ, ఎంపీటీసీ ఎస్‌వీవీ సత్యనారాయణ, పాలక మండలి సభ్యులు జీఎస్‌వీ నాగాజీ,జీవీవీ సత్యనారాయణ, గ్రంధి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు

నాణ్యమైన విద్యుత్ పంపిణీయే లక్ష్యం

విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి

అనకాపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని,అందులో భాగంగా ఏపీఈపీడీసీఎల్ పరిధిలోని 11 జిల్లాల్లో రూ.250 కోట్లతో 69 సబ్‌స్టేషన్లు నిర్మిస్తున్నట్టు రాష్ట్ర విద్యుత్ శాఖా మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. బుధవారం ఆయన అనకాపల్లిలో రూ.5.5 కోట్లతో నిర్మించనున్న ఏపీఈపీడీసీఎల్ సర్కిల్ కార్యాలయానికి శంకుస్థాపన చేశారు. అనంతరం జిల్లాలోని కె.కోటపాడు మండలం చౌడువాడ, కింతలి గ్రామాల్లో నిర్మించిన సబ్‌స్టేషన్లను ప్రారంభించారు.ఈ సందర్భంగా చౌడువాడలో ఏర్పాటుచేసిన సభలో మంత్రి మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించేందుకు అన్ని ప్రాంతాల్లో కొత్తగా సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం విధించిన ఎఫ్‌పీపీసీఏ (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ ప్రైస్ అడ్జస్ట్‌మెంట్) చార్జీ (యూనిట్‌కు) 40 పైసల నుంచి 27 పైసలకు తగ్గించనున్నట్టు పేర్కొన్నారు.ప్రతిఒక్కరూ సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకొని ప్రయోజనం పొందాలన్నారు. అనకాపల్లి జిల్లాలో ఇప్పటివరకూ 20 వేల మంది ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఇళ్లకు సోలార్ విద్యుత్ ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీ సీఎం రమేశ్,ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బండారు సత్యనారాయణమూర్తి, కె.రాజు, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు పాల్గొన్నారు.

జాతీయ వాలీబాల్ పోటీలకు అక్షయ ఎంపిక



సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ పి.వెంకటాపురం అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల 9వ తరగతి విద్యార్థి శీలి అక్షయ జాతీయ వాలీవాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పరిమళ తెలిపారు. ఈ నెల 1నుంచి 3వరకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఎస్‌జీఎఫ్ఐ) ఆధ్వర్యంలో నిర్వహించిన అండర్-17 వాలీబాల్ సెలక్షన్స్‌లో అత్యంత ప్రతిభ కనబరిచి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. త్వరలో ఉత్తరప్రదేశ్‌లో జరిగే వాలీబాల్ పోటీల్లో రాష్ట్రం తరఫున పాల్గొంటుందని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. జాతీయ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శనతో అంబేద్కర్ ఆశ్రమ పాఠశాలకు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో రాణించేలా తర్ఫీదునిస్తున్న పీడీ శారదను అభినందించారు.

వారాహిమాత ఆలయ ఆదాయం రూ.10 లక్షలు


హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు, సిబ్బంది

కాకినాడ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ రూరల్ మండలం కొవ్వూరులోని శ్రీవారాహి అమ్మవారి ఆలయ హుండీలను బుధవారం లెక్కించినట్టు ఆలయ సింగిల్ ట్రస్టీ ఆర్.సౌజన్య తెలిపారు. దేవదాయ ధర్మదాయ శాఖ కాకినాడ తనిఖీ అధికారి వడ్డి ఫణీంద్రకుమార్ హుండీలను తెరవగా ఈవోలు బీవీవీ చౌదరి, ధనలక్ష్మి, మురళీ వీరభద్రరావు, సత్తిబాబు, తిరుమల రవితేజ పాల్గొనగా మొత్తం 40 రోజులకు గానూ రూ.10,18,071 ఆదాయం వచ్చిందన్నారు. సీసీ కెమెరాల నిఘాలో గ్రామ పెద్దలు, పోలీసుల సమక్షంలో హుండీల ఆదాయం లెక్కింపు జరిగినట్టు ఈవో తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హార్లిక్స్ ఫ్యాక్టరీ సమీపంలోని హైవే బ్రిడ్జిల కింద రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతి చెందాడని జీఆర్పీ సీఐ శ్రీనివాసరెడ్డి తెలిపారు. సుమారు 50ఏళ్ల వయసు కలిగి నలుపు రంగు ప్యాంటు, నీలం రంగు సెక్యూరిటీగార్డులు వేసుకొనే యూనిఫాం షర్టు ధరించి ఉన్నాడన్నారు. వివరాలు తెలిసిన వారు 99597 63463 నెంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

అన్నవరం.. భక్తజనసంద్రం



- వేడుకగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ
- సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- ఉదయం పల్లకీసేవలో, మధ్యాహ్నం సత్యరథం వెంబడి

గిరియాత్రలో పాల్గొన్న 2 లక్షలమంది భక్తులు



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువైన రత్నసత్యగిరిలు బుధవారం జై సత్యదేవ నామస్మరణతో మార్మోగాయి. స్వామి వెలసి భక్తులతో పూజలందుకునే 2 కొండల చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం నిర్వహించిన స్వామివారి గిరిప్రదక్షిణకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 2 లక్షల మంది విచ్చేయడంతో అన్నవరం భక్తజనసం ద్రమైంది. గతేడాది మాదిరిగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఉదయం 8.30 గంటలకు పల్లకీలో, సత్యరథం భక్తులతో మధ్యాహ్నం 2గంటలకు గిరియాత్ర ప్రారంభించారు. ఉదయం 7.30కి కొండపై నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో మెట్లమార్గం గుండా కొండదిగువన తొలిపావంచా వద్దకు తోడ్కొనివచ్చారు. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, గిరిప్రదక్షిణ ప్రత్యేకాధికారి ఆర్‌జేసీ వేంద్ర త్రినాదరావు టెంకాయి కొట్టి స్వామివారి పల్లకీసేవ ద్వారా గిరిప్రదక్షిణ ప్రారంభించారు. స్వామి,అమ్మవార్లను పల్లకీలో పండితుల మంత్రోచ్చరణలు భక్తుల గోవిందనామస్మరణలతో ఈ గిరియాత్ర తొలిపావంచా వద్ద నుంచి జాతీయ రహదారి మీదుగా బెండపూడి సమీపంలో పుష్కరకాలువ రోడ్డుగుండా సుమారు 8.5 కిలోమీటర్లమేర సాగింది.

పంపా తీరం వద్ద ముగిసే..

పంపా తీరం వద్ద గిరిప్రదక్షిణ యాత్ర ముగిసింది. చివరగా ప్రత్యేక మండపంలో స్వామి,అమ్మవార్లకు ప్రత్యేకపూజలు నిర్వహించి చతుర్వేదపండితుల వేద స్వస్తి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలందజేశారు. కొందరు భక్తులు యాత్ర అనంతరం పంపా రిజర్వాయర్‌లో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి దర్శనానికి రత్నగిరి కొండకు చేరుకోగా మరికొందరు తిరిగి స్వగృహాలకు చేరుకున్నారు. గిరియాత్ర విజయవంతంతో సిబ్బందిని ఈవో, చైర్మన్లు అభినందించారు. ఇదిలా ఉండగా గిరిప్రదక్షిణ దారిలో రోలింగ్ సరిగా చేయకపోవడం,ఎండుగడ్డి అక్కడక్కడా మాత్రమే పరచడంతో భక్తులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మధ్యలో కొన్నిచోట్ల గ్రీన్‌కార్పెట్ పరచడం ఉపశమనం కలిగించింది.





భక్తులకు మంచినీళ్లు, పండ్లు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఎమ్మెల్యే నెహ్రూ

ప్రభుత్వ అప్రమత్తతతో ప్రత్యేక ఏర్పాట్లు

ఇటీవల కాశీబుగ్గ ఘటన నేపథ్యంలో ప్రభుత్వం ఇటు రెవెన్యూ, పోలీస్, దేవదాయశాఖ అధికారులను అప్రమత్తం చేసింది. సుమారు 700మంది పోలీసులు, ఆరుగురు తహశీల్దార్లు, 20మంది వీఆ ర్వోలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ శ్రీహరిరాజు పర్యవేక్షణలో ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు పల్లకీ, సత్యరథం వెంబడి నడుస్తూ ఎక్కడా తోపులాటలకు ఆస్కారం ఇవ్వకుండా రోప్‌పార్టీ ద్వారా కార్యక్రమాన్ని ముందుండి నడిపించారు.

శోభాయమానంగా పంపా హారతులు

కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం రాత్రి పంపాహారతులు కార్యక్రమం అత్యంత శోభాయమానంగా జరిగింది. రాత్రి 6.30కి స్వామి, అమ్మవార్లను కొండపై నుంచి మేళతాలాలు, పండితుల మంత్రోచ్చరణల నడుమ తెప్పోత్సవానికి వినియోగించిన పంటు వద్దకు తోడ్కొనివచ్చి పంటుపై ఆశీనులు గావించి గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం నదీమతల్లికి పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం అర్చకస్వాములు పంపానదికి ఏడురకాలైన హారతులిచ్చారు. ముందుగా ఏక హారతి, నేత్రహారతి, బిల్వ హారతి, సర్పహారతి, కుంభహారతి, నక్షత్ర హారతుల నంతరం చివరగా కర్పూర హారతులిచ్చారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనంతో కార్యక్రమం ముగిసింది. ఈవో, చైర్మన్, ప్రత్యేకాధికారి పాల్గొనగా వైదిక కార్యక్రమాలను ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం, ఇంద్రగంటి నరసింహమూర్తి రుత్వికులు చామర్తి కన్నబాబు, పాలంకి పట్టాభి తదితరులు నిర్వహించారు.

కొండలు, గుట్టలు దాటుకుని...

సత్యరథం ద్వారా ప్రదక్షిణకు దేవస్థానం విస్తృత ప్రచారం చేపట్టడంతో అధికసంఖ్యలో భక్తులు సత్యరత్నగిరికొండల వెంట నడిచారు. కొండలు, గుట్టలు దాటుకుని గోవిందనామస్మరణల నడుమ భక్తిశ్రద్ధలతో పాల్గొన్నారు. దేవస్థానం, దాతల సహకారంతో పండ్లు, మజ్జిగ, బిస్కట్ ప్యాకెట్ల స్టాల్స్ ఏర్పాటుచేశారు. దేవస్థానం తరుపున సుమారు 2 లక్షల మంచినీటి ప్యాకెట్లను పీఆర్వో విభాగం అందుబాటులో ఉంచారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇబ్బందులు జరగకుండా ఈవో, చైర్మన్, ప్రత్యేకాధికారి ఎప్పటికప్పుడు వాకీటాకీల ద్వారా సమాచారం తెలుసుకుని అధికారులకు సూచనలు చేశారు. మార్గమధ్యంలో వైద్యశిబిరాలు ఏర్పాటుచేసి వైద్యసేవలందించారు. గిరియాత్రకు తరలివచ్చిన భక్తులతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. ప్రత్తిపాడు సీఐ సూరిఅప్పారావు ఆధ్వర్యంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

వైభవంగా జ్వాలాతోరణం

జ్వాలాతోరణం వెలిగించిన దృశ్యం

కార్తీకపౌర్ణమి సందర్భంగా కొండదిగువన తొలిపావంచా వద్ద జ్వాలాతోరణం కార్యక్రమం వైభవంగా జరిగింది. పంపా హారతులు ముగిసిన తరువాత స్వామి,అమ్మవార్లను పంపాతీరం నుంచి తొలిపావంచా వద్దకు రాత్రి 8గంటలకు తోడ్కొనివచ్చారు. తొలిపావంచాకు ఇరువైపులా ఎండిగడ్డితో తోరణాన్ని ఏర్పాటు చేశారు. స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అనంతరం అర్చకస్వాములు వేదమంత్రాల నడుమ తోరణానికి నిప్పంటించారు. వాటి మధ్యలో పల్లకీలో స్వామి,అమ్మవార్లను ముమ్మారు ప్రదక్షిణ చేయించారు. తోరణం నుంచి జ్వాల అనంతరం వెలువడిన భస్మం కోసం భక్తులు పోటీపడ్డారు. ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు ఆధ్వర్యంలో పోలీసులు ట్రాఫిక్‌ను జాతీయరహదారి మీదుగా మళ్లించారు.



గిరిప్రదక్షిణలో పాల్గొన్న ఈవో సుబ్బారావు కుటుంబం





అలసిపోయిన భక్తుల అవస్థలు



సత్యదేవుడి సేవలో పాల్గొన్న మహిళలు

మా కుమార్తె మృతిపై అనుమానాలున్నాయి

పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలి : రంజిత తల్లిదండ్రులు

రామచంద్రపురం (ద్రాక్షారామ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురంలో 5వ తరగతి విద్యార్థిని రంజిత మంగళవారం ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. బుధవారం పట్టణంలో ఏరియా ఆసుపత్రిలో బాలిక మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఈ సంఘటనపై రంజిత తల్లిదండ్రులు సునీత,రాజు మాట్లాడుతూ మా కూతురి మృతిపై తమకు అనుమానాలు ఉన్నట్టు తెలిపారు. ఆసుపత్రి వద్ద విలేకర్లతో వారు మాట్లాడారు. తమ కుమార్తె ఉరి వేసుకున్న తీరును చూస్తే అనుమానం కలుగుతుందన్నారు. తమ ఇంటి యజమాని కుమారుడిపై అనుమానం వ్యక్తం చేశారు. తాము ఈ ఇంటిలో 3ఏళ్లుగా ఉంటున్నామన్నారు. ఉరి వేసుకున్న చున్నీముడులు విప్పడం సాధ్యం కాలేదని, బాలిక అన్ని ముడులు వేయడం సాధ్యం కాదని తెలిపారు. ఉరివేసుకోవడానికి తమ కుమార్తె ఫ్యాను అందే ఎత్తులో లేదని అక్కడ ఎత్తుకు ఏవిధమైన స్టూల్‌గాని మరొకటిగాని ఉపయోగించిన దాఖలాలులేవని పేర్కొన్నారు. మా కుమార్తెను హత్య చేసి ఉరి వేసి ఉండవచ్చనే అనుమానం ఉందన్నారు. ముఖ్యంగా గతంలో నేరచరిత్ర కలిగిన ఇంటి యజమాని కుమారుడిపై అనుమానం ఉందని, పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.

చెడు వ్యసనాలకు బానిసై ఇళ్లల్లో చోరీలు



నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న తిమ్మాపురం ఎస్ఐ

యువకుడి అరెస్ట్

బంగారం, వెండి, నగదు స్వాధీనం

సర్పవరం జంక్షన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై సులువుగా డబ్బు సంపాదించాలనే ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న యువకుడిని తిమ్మాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. 10.6 గ్రాముల బంగారు వస్తువులు, 1026.4 కిలోల వెండి వస్తువులతో పాటు రూ.18,196 నగదును స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లో కెళితే కాకినాడ సూర్యారావుపేటకు చెందిన లంక నాగవీర వెంకట దుర్గాశివ గణేష్ (20) ప్రస్తుతం లచ్చి రాజువారి వీధి టూటౌన్ పోలీస్‌స్టేషన్ వెనుకాల నివసిస్తున్నాడు. అతడు గతంలో దుస్తుల దుకాణంలో పని చేసి 2 నెలల క్రితం మానేసి ఇంటిలో ఉంటున్నాడు. చెడు వ్యసనాలు, ఫోన్‌లో బెట్టింగ్‌లకు బానిసై డబ్బుల కోసం తిమ్మాపురం, టూటౌన్ పోలీసు స్టేషన్ల పరిధిలో బయట తాళం వేసి ఉన్న ఇళ్ల వద్ద పగటి పూట రెక్కీ నిర్వహించి వరుస చోరీలకు పాల్పడు తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం 4.50 గంటలకు గణేష్ తిమ్మాపురం వై.జంక్షన్ వద్ద ఉండగా అరెస్ట్ చేసినట్టు తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ పేర్కొన్నారు.

పంచాయతీరాజ్ శాఖలో పదోన్నతులు

రెండేళ్ల సర్వీస్‌ను ఏడాదికి తగ్గిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ

ఉమ్మడి జిల్లాలో నూతనంగా 60 డిప్యూటీ ఎంపీడీవో పోస్టులు

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్ శాఖలో పని చేస్తున్న సిబ్బందికి భారీస్థాయిలో పదోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటివరకు 2 సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసిన వారికి ప్రమోషన్ అర్హత ఉండగా ఇప్పుడు ఆ కాలాన్ని ఏడాదికి తగ్గిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ నిర్ణయంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా గ్రేడ్ 2 పంచాయతీ కార్యదర్శులు గ్రేడ్ 1కి పదోన్నతి పొందనున్నారు. అలాగే 150 మందికి పైగా 1 పంచాయతీ కార్యదర్శులు డిప్యూటీ ఎంపీడీవోలుగా పదోన్నతి పొందనున్నారు. ఇకపై గ్రామ సచివాలయాల పర్యవేక్షణ కోసం మండలస్థాయిలో డిప్యూటీ ఎంపీడీవో పోస్టులను నూతనంగా నియమించనున్నారు. దీని ద్వారా ఉమ్మడి జిల్లాలో ఉన్న 60 మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలు బాధ్యతలు చేపటి ఆయా మండలాల్లో సచివాలయాలను పర్యవేక్షించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిపాదనను ఆమోదించడంతో మార్గం సుగమమైంది.

నగదు, మోటార్ సైకిళ్ల చోరీ కేసులో నలుగురి అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు మైనర్లు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): చదువుకోవాల్సిన సమయంలో వారు చెడుమార్గం పట్టారు. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడుతూ పోలీసులకు పట్టుబడ్డారు. ఇందులో ముగ్గురు మైనర్లు ఉండటం గమనార్హం. వివరాల్లోకి వెళితే.. గొల్లప్రోలు మండలం చేబ్రోలులో గల చల్లా చినబాబు షాపింగ్ కాంప్లెక్సులో లక్ష్మీవెంకటేశ్వర ఏజెన్సీస్, ఐస్‌పార్లర్‌లో రూ. 45 వేల నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకుపోయారు. షాపు నిర్వాహకుడి ఫిర్యాదుతో గొల్లప్రోలు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఎస్ఐ ఎన్.రామకృష్ణ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. కాగా, సీసీ కెమెరాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారంగా దర్యాప్తు సాగించారు. దీంతో చోరీకి పాల్పడిన పిఠాపురం పట్టణానికి చెందిన గుబ్బల దయానంద్‌పాల్ (22), 17 సంవత్సరాల బాలుడు ఒకరు, 16 సంవత్సరాల బాలురు ఇద్దరితో కలిపి నలుగురిని అరెస్టు చేశారు. అంతేకాకుండా విచారణలో వీరు మరిన్ని చోరీలకు పాల్పడినట్టు వెల్లడైంది. ఇందులో అనకాపల్లి జిల్లా నర్సీపట్నం, పిఠాపురం మండలం మాధవపురంలో రెండు మోటార్ సైకిళ్లను చోరీ చేసినట్టు గుర్తించారు. వీటిని స్వాధీనం చేసుకుని కోర్టులో హాజరుపరిచారు. కాగా నిందితుల్లో ఒకరు బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నారు. మిగిలిన ఇద్దరు మైనర్లు మధ్యలో చదువు మానివేసినట్టు తెలిసింది. రానున్న రోజుల్లో ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

ఉరేసుకుని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

పోలీస్ కేసు నమోదు

రాజానగరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధి రాజమహేంద్రవరం రూరల్ మండలం తొర్రేడులోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న ఒక విద్యార్థి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి రాజానగరం ఎస్ఐ ప్రియకుమార్ బుధవారం ఇక్కడ విలేకరులకు వివరాలు వెల్లడించారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చందుర్తికి చెందిన యార్ల ప్రసాద్ వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈయన కుమారుడు యాళ్ల సత్యదేవకుమార్ (16) తొర్రేడులోని ఓ విద్యాసంస్థలో గల వసతి గృహంలో ఉంటూ ఇంటర్ చదువుకుంటున్నాడు. కాగా, తాను వసతి గృహంలో ఉండలేకపోతున్నానని, ఇంటి వద్ద నుంచే కళాశాలకు వెళ్తానని అప్పుడప్పుడూ మారాం చేసేవాడు. ఈ క్రమంలో గత నెల 28న సత్యదేవకుమార్ అనారోగ్యానికి గురయ్యాడు. దీంతో కళాశాల నుంచి యాజమాన్యం అనుమతితో తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. ఆరోగ్యం కుదుట పడిన తర్వాత హాస్టల్‌కు తిరిగి తీసుకెళ్లే క్రమంలో ఇంటి వద్ద నుంచే వెళ్తానని చెప్పాడు. దీంతో తల్లిదండ్రులు ఈ ఏడాది ఓపిక పట్టు, వచ్చే ఏడాది నుంచి నీకు నచ్చినట్టు కళాశాలకు వెళ్దువుగాని అని నచ్చజెప్పి పంపించేవారు. ఈ క్రమంలో ఈనెల 4న ఉదయం 10.30 గంటలకు తండ్రి ప్రసాద్ సత్యదేవ కుమార్‌ను తీసుకుని కళాశాలకు చేరుకున్నారు. తన కుమారుడు డే స్కాలర్‌గా చదువుతా నంటున్నాడని ప్రిన్సిపాల్‌తో మాట్లాడి ఒప్పించి వదిలి వచ్చినట్టు తండ్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ నేపథ్యంలో తన కుమారుడు ఉరేసుకున్నాడని, కొనఊపిరితో ఉండడంతో సాయి ఆసుపత్రిలో చేర్పించామని అదేరోజు మధ్యాహ్నం 2.30 గంటలకు కళాశాల యాజమాన్యం ఫోన్‌లో సమాచారం అందించింది. దీంతో వెంటనే ఆసుపత్రికి వచ్చి చూడగా తన కుమారుడు చనిపోయినట్టు ఆసుపత్రి వైద్యులు నిర్ధారించారని ఆయన తెలిపారు. ఈమేరకు తన కుమారుడు ఇంటిమీద బెంగతో హాస్టల్‌లో ఉండలేకే ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని భావిస్తున్నానని, తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ తండ్రి ప్రసాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. రాజానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

అనుమానాస్పద మృతికేసులో అదుపులోకి..

- నిందితుడ్ని కోర్టులో ప్రవేశపెట్టిన యానాం పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న యూనాం ఎస్పీ వరదరాజన్, సిబ్బంది

యానాం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : యానాం బల్లవారివీధిలో ఓ ఇంట్లో అద్దెకుంటున్న వివాహిత అనుమానాస్పద మృతి కేసులో నిందితుడైన భర్త పెమ్మడి నానిను యానాం పోలీసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యానాం ఎస్పీ వరదరాజన్ వివరాలను వెల్లడించారు. ఐ.పోలవరం మండలం గుత్తెనదివికి చెందిన పెమ్మడి దీనా(26), భర్త నానీ గత నాలుగు నెలలుగా అద్దెకు ఉంటు న్నారు. కాగా, వీరి మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. మద్యానికి బానిసైన నాని తరచూ భార్యను అనుమానంతో కొడుతుండేవాడు. దీంతో దీనా కొంత కాలంగా వేరుగా ఉండటంతో పాటు భర్త నాని నుంచి విడాకులు కోరుతూ కోర్టును ఆశ్ర యించారు. ఈ క్రమంలో నాని మళ్లీ గొడవ పడ్డాడు. కాగా, దీనా ముఖంపై బలంగా కొట్టడంతో పాటు పీక పిసికి హత్య చేసిన అనంతరం ఆమె ఫోన్ తీసుకుని నాని పారిపోయాడు. మృతదేహం పోస్టుమార్టం నిమిత్తం బంధువులకు అప్పగించారు. యానాం పోలీసులు, క్రైంసిబ్బంది నిందితుడు నానిని అదుపులోకి తీసుకుని హత్యకు గల కారణలను సేకరించారు. అనంతరం నిందితుడ్ని కోర్టులో ప్రవేశపరిచి రిమాండ్ కోసం యానాం సబ్ జైలుకు తరలించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అడలరసన్, ఎస్ఐలు పునీత్‌రాజా, కట్టా సుబ్బరాజు, క్రైం సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేటలో అగ్నిప్రమాదం

- రెండిళ్లు దగ్ధం ..

రూ. 5 లక్షల ఆస్తినష్టం



కాలిపోయిన ఇళ్లను పరిశీలిస్తున్న రెవెన్యూసిబ్బంది

వీఆర్‌పురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సీతంపేటలో బుధవారం ఉదయం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. ఉదయం పుట్టలో పాలు పోసేందుకు ఇరు కుటుంబాల వారు వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం జరగడంతో సామగ్రి, నగదు, బంగారం కాలిపోవడంతో బాధిత కుటుంబాలు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. రూ. ఐదు లక్షల ఆస్తినష్టం ఏర్పడిందని అంచనా. రెవెన్యూ ఆర్ఐ అక్కడకు చేరుకుని పంచనామా నిర్వహించారు. బాధిత కుటుంబాలకు తహశీల్దార్ సరస్వతి ఆదేశాలతో 25 కిలోల బియ్యం అందజేశారు. దాతలు ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

కొత్తపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనరేటర్ నుంచి వచ్చిన కరెంట్‌షాక్‌తో ఒకరు మృతిచెందాడు. ఈ సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం రమణక్కపేటలో బుధవారం చోటుచేసుకొంది. దళితపేటకు చెందిన ఎం. నూకరాజు (31) గ్రామ శివార్లో రొయ్యల చెరువుల వద్ద కూలీ పనులు చేస్తుంటాడు. చెరువులకు వచ్చే కరెంటు స్తంభంపై హెచ్‌జీ ఫీజు పోవడంతో బుధవారం కరెంట్ సరఫరా అకస్మాత్తుగా నిలిచిపోవడంతో చెరువుల నిర్వాహకుడు నూకరాజును స్తంభం ఎక్కి హెచ్‌జీ ఫీజు వేయాలని చెప్పడంతో ఎక్కి ఫీజు వేస్తుండగా అప్పటికే ఆన్‌లో ఉన్న జనరేటర్ కరెంటు స్తంభానికి రిటర్న్ వచ్చి షాక్ కొట్టడంతో నూకరాజు స్తంభంపైనే మృతిచెందాడు. సమాచారం తెలుసుకొన్న కొత్తపల్లి ఎస్ఐ జీ. వెంకటేష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

నల్లజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిన్ను ప్రేమిస్తున్నాను.. వివాహం కూడా చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ వివాహితను నమ్మించి మోసం చేసిన యువకుడిపై నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయ్యింది. వివరాలివి.. తెలికిచర్లకి చెందిన మరీదు రామాంజనేయులు తన భర్తతో విభేదాల కారణంగా గత మూడు సంవత్సరాలుగా పుట్టింటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శారీరకంగా కలిశారు. ప్రస్తుతం ఆమె గర్భం దాల్చడంతో మొఖం చాటేశాడు. దీంతో పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

కంచిపల్లి శ్రీనివాస్ హత్య కేసును ఛేదించిన పోలీసులు

- నేడు నిందితులను అరెస్టు చేసే అవకాశం
- లోకేష్‌ను కలిసిన మృతుడి భార్య దేవి



అమలాపురం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొంకాపల్లికి చెందిన కంచిపల్లి శ్రీనివాస్ (37) హత్య కేసును అమలాపురం పట్టణ పోలీసులు ఛాలెంజ్‌గా తీసుకుని ఎట్టకేలకు ఛేదించారు. నిందితుల వివరాలను గురువారం ప్రకటించే అవకాశం ఉంది. కాగా మంగళవారం రాత్రి శ్రీనివాస్ భార్య దేవి తన పిల్లలను తీసుకుని ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌ను కలిసి తన భర్త శ్రీనివాస్ హత్యకు దారితీసిన పరిస్థితులను వివరిస్తూ తన గోడు వెళ్లబుచ్చుకుంది. వైసీపీకి చెందిన రౌడీషీటర్లు తన భర్తను అతి కిరాతకంగా హత్య చేశారని ఆమె తన బిడ్డల సాక్షిగా వివరించింది. తన కుటుంబానికి తీరనిఅన్యాయం చేసిన వైసీపీ నాయకుల ముఠాను అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరింది. అలాగే రాష్ట్ర కార్మిక మంత్రి వాసంశెట్టి సుభాష్‌ను కలిసి ఆమె తనకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. హత్యకు దారితీసిన పరిస్థితులను ఇప్పటికే పోలీసులు గుర్తించారు. హత్యకు ఉపయోగించిన ఆయుధాలు, వాహనాల్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హత్యకు పాల్పడిన కీలక నిందితులు గంగుమళ్ల షణ్ముఖేశ్వరరావు అలియాస్ కాసుబాబు, అడబాల శంకర్, సలాది రాంబాబు అలియాస్ అప్పన్న, భాస్కర్ల ప్రసాద్, రావులపాలెంకు చెందిన అనిల్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికీ ఈ కేసులో ఎవరినీ అరెస్టు చేయలేదని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. హత్య రోజు ఏమి జరిగింది? ఇందులో ఎవరెవరు పాల్గొన్నారు?నాలుక కోసేశారా?తదితర అంశాలపై పోలీసులు ఇప్పటికే దర్యాప్తు పూర్తి చేసినట్టు సమాచారం. హత్య జరిగిన నాటి నుంచి ప్రధాన నిందితుడు కాసుబాబు పరారీలో ఉండటంతో అమలాపురంలోని ఆయన వ్యాపార లావాదేవీలన్నీ పూర్తిగా స్తంభించాయి. హత్యకు ఉపయోగించిన ఆయుధాల కోసం పోలీసులు ప్రధాన పంటకాల్వల్లో బుధవారం వేట చేపట్టినట్టు తెలిసింది. ఇంతకూ శ్రీనివాస్ చేత ఫోన్ చేయించింది ఎవరు అనేది పోలీసులే చెప్పాలి.

4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారం చోరీ

కడియం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పొట్టిలంకలో ఓ ఆర్ఎంపీ వైద్యుడి ఇంట్లో దొంగతనం జరిగి 4 కిలోల వెండి, 10 గ్రాముల బంగారం పోయినట్టు పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. పొట్టిలంకకు చెందిన ఆర్ఎంపీ డాక్టర్ అలియాస్ చెముడులంక డాక్టర్ వేపూరి సూర్యసత్యనారాయణ, అతని భార్య ఇటీవల హైదరాబాద్ వెళ్లారు. ఈయనకు ఉన్న ఇద్దరు అబ్బాయిల్లో ఒకరు అమెరికాలో, మరొకరు సింగపూర్‌లో ఉంటుండగా, అమ్మాయి హైదరాబాదులో ఉంటున్నారు. ఇదిలా ఉండగా మంగళవారం రాత్రి ఆర్ఎంపీ డాక్టర్ సూర్యసత్యనారాయణ ఇంటి ప్రధాన ద్వారం తెరిచిబీరువా తాళాలు పగుల గొట్టి బంగారం, వెండి దొంగిలించుకుపోయారు. పొట్టిలంకలోనే ఉంటున్న డాక్టర్ పెద్దకోడలు స్వాతి ఉదయం సమయంలో ఇంటిని శుభ్రం చేయడానికి తలుపులు తెరవగా తలుపులు, బీరువా బద్దలు కొట్టి ఉన్నట్టు గమనించారు. దీంతో బీరువాలో వస్తువులు పోయినట్టు గమనించి అత్తమామలకు తెలిపారు. అనంతరం పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఏ. వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాప్రసాద్, క్రైమ్ సిబ్బందితో పాటు క్లూస్‌టీమ్‌ను రప్పించి సంఘటనా స్థలంలో పలు ఆధారాలు సేకరిస్తున్నారు. ఆర్ ఎంపీ డాక్టర్ కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమిశ్రగూడెంలో 16.5 కాసుల బంగారం చోరీ

- వేలిముద్రలు సేకరించిన క్లూస్ టీమ్

నిడదవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఇంట్లోని బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో నివాసముంటున్న కాసగాని సత్యనారాయణ భార్యకు ఈనెల 1వ తేదీన పాము కాటు వేయడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంటిలో లైట్లు వెలుగుతుండడంతో కాసగాని సత్యనారాయణ అన్న కుమారుడు దుర్గాప్రసాద్ ఫోన్ చేసి ఇంటిలో లైట్లు వెలుగుతున్నాయి వచ్చేశారా అని పలకరించడంతో హుటాహుటిన వచ్చిన సత్యనారాయణ ఇంటిలోకి వెళ్లి పరిశీలించగా సుమారు 16.5 కాసుల బంగారు ఆభరణాలు దొంగలు పట్టుకొని పోయినట్టు గుర్తించి సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై సమిశ్రగూడెం ఎస్సై జె.కల్పన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఇంటి నుంచి వేలిముద్రలు సేకరించారు.

ఆదరణలో ఆధునిక పనిముట్లు చేర్చాలి

మంత్రి సవితను కలసిన యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల



మంత్రి సవితకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దివాన్‌చెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదరణ పథకంలో ఆధునిక పనిముట్లు చేర్చి వెనుకబడిన తరగతుల వారికి అందజేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.సవితను కలసి కోరామని రాష్ట్ర యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు(నాగు) తెలిపారు. రాష్ట్ర మంత్రి సవిత ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన బోర్డు సమావేశానికి హాజరై వచ్చిన నాగు ఆ వివరాలను బుధవారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. జిల్లా, నియోజకవర్గ, మండలాల్లో యాదవ భవన నిర్మాణాలకు భూమి కేటాయించాలని కోరామన్నారు. కొత్తగా చిన్న, మధ్యతరహా పరిశ్రమలు నెలకొల్పుటకు యాదవులకు రాయితీ రుణాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశామని చెప్పారు. అలాగే రాష్ట్ర బీసీ గణన, బర్రెలు, గొర్రెలు, మేకలు పెంపకం, మినీ సూపర్‌బజార్‌కు రాయితీ రుణాలు, గ్రూప్స్, సివిల్స్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల కోసం యాదవ స్టడీ సెంటర్లు ఏర్పాటు తదితర విషయాలను చర్చించామని చెప్పారు. తమ వినతిపై మంత్రి సానుకూలంగా స్పందించారని బత్తుల నాగు పేర్కొన్నారు.

కందుకూరి రాజ్యలక్ష్మి జయంతి

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా కళాశాలలో బుధవారం కందుకూరి రాజ్యలక్ష్మి జయంతిని ప్రిన్సిపాల్ పి.రాఘవకుమారి ఆధ్వర్యంలో నిర్వహించారు. కందుకూరి వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కందుకూరి రాజ్యలక్ష్మి, వీరేశలింగంతో పాటు మహిళా సాధికారతకు, బాలికల విద్యాభివృద్ధికి ఎనలేని సేవలందించారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎం.సునీత, కె.నీరజ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అలాగే వాకర్స్ యోగా అండ్ లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో వీటీ డిగ్రీ కళాశాల ఆనంద్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీకే విశ్వేశ్వరరెడ్డి, చల్లా సత్యవాణి, శనపతి సత్తిబాబు, టి.ఉమామహేశ్వరి, కాసా జయప్రద, తాడేపల్లి భానుమతి, గుబ్బల గంగాభవాని విచ్చేశారు. 80 మంది వృద్ధులకు 500 రూ.చొప్పున పింఛన్లు, దుప్పట్లు, అన్నప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో యు.కాశీవిశ్వనాథం, సూరపురెడ్డి తాతారావు,గీసాల బాబ్జీ, లంక శ్రీదేవి, టీవీ లత, ఎం.సాయిరెడ్డి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం సిటీ:స్థానిక ఆనంద్ గార్డెన్స్‌లోని కందుకూరి సమాధుల వద్ద హితకారిణి సమాజం ఛైర్మన్ డాక్టర్ యాళ్ల ప్రదీప్ సుకుమార్, డైరెక్టర్లు మేడపాటి సాయి భాగ్యలక్ష్మి, అనంత సత్యనాగవల్లి, కిలారి లక్ష్మిలతో కలిసి నివాళులర్పించారు. మహిళా సాధికారతకు రాజ్యలక్ష్మి చేసిన కృషిని గుర్తుచేశారు. విశ్వనాథ రాజు, హితకారిణి సమాజం, ఎస్‌కేఆర్‌ఎంబీఏ డీఈడీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సృజనాత్మక దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలి

రాజానగరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని కొత్త ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావడానికి సృజనాత్మక దృక్పథాన్ని అభివృద్ధి చేసుకోవాలని అమరావతి సాఫ్ట్‌వేర్ ఇన్నోవేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు, ఎండీ అనీల్‌కుమార్ చింతా ఆకాంక్షించారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో ఐడియాస్ టు ఇంపాక్ట్ అనే అంశంపై బుధవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి సూచనలు, సలహాలు అందించారు. ఇన్నోవేషన్ సెల్ డైరెక్టర్ వై.మురళీధర్‌రెడ్డి విద్యార్థులకు ఆవిష్కరణల ప్రాముఖ్యతను వివరించారు. స్కూల్ ఆఫ్ సైన్సెస్ డీన్ కె.వల్లీ మాధవి, ఎంబీఏ విభాగాధిపతి, ఆర్.రాజు, బీబీఏ విభాగాధిపతి సీహెచ్ వెంకటేశ్వర్లు విద్యార్థుల వ్యాపార ఆలోచనలను ప్రాజెక్టులుగా మార్పు చేయడంలో మార్గదర్శకత్వం వహించారు. విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్‌కు సత్కారం

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) :రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా ఇటీవల నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ పీవీవీ సత్యనారాయణను తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ, ఎస్టీ సంఘాల ఆధ్వర్యంలో పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా ఆయన ఛాంబర్‌లో కలసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే ఎంతో ప్రతిష్టాత్మకమైన రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు సూపరింటెండెంట్‌గా బాధ్యతలు చేపట్టడం ఆనందంగా ఉందని, పేదలకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తానన్నారు.కార్యక్రమంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ సంఘాల అధ్యక్షుడు కోరుకొండ చిరంజీవి, తాళ్లూరి బాబూ రాజేంద్రప్రసాద్, దారా ఏసురత్నం, ఎం.సత్యనారాయణ, కాశి నవీన్ కుమార్, జంగం సుబ్బారావు, ఉసురుమర్తి రామారావు, డేవిడ్, గిరిబాబు, రాజు, వెంకటరావు, వెంకటేశ్వరరావు, కుమార్‌బాబు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు ఘనంగా భిక్ష వితరణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గోదావరి గట్టున ఉన్న అయ్యప్పస్వామి ఆలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామి దీక్షాధారులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా భిక్ష వితరణ జరిపారు. ఈ సందర్భంగా అయ్యప్పస్వామి ఆలయ కమిటీ సభ్యులు, వైసీపీ రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రాధిక దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొని అయ్యప్పస్వాములకు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. అనంతరం విరాళ చెక్కును ఆలయ అభివృద్ధి కమిటీ పెద్దలకు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, జక్కంపూడి విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఇక్కడ నిత్యం భిక్ష వితరణ జరుగుతున్నదని ఆలయ కమిటీ పేర్కొంది.

గోదావరి తీరం

భక్తజన సంద్రం



రాజమహేంద్రవరంలో పుష్కర ఘాట్‌లో కార్తీక పౌర్ణమి స్నానాలు చేస్తున్న భక్తులు

- ఘనంగా కార్తీక పౌర్ణమి స్నానాలు
- ఘాట్లను పరిశీలించిన కమిషనర్ రాహుల్‌మీనా

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజమహేంద్రవరంలోని గోదావరి రేవులు భక్తులతో పోటెత్తాయి. వేకువ జామునుంచి అధిక సంఖ్యలో పుణ్య స్నానాలు ఆచరించారు. అటుపై కొందరు నోములు నోచుకుని పూజలు చేశారు. దేవాలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది చేసిన ఏర్పాట్లను నగరపాలక సంస్థ కమిషనర్ రాహుల్‌మీనా పరిశీలించారు. భక్తులతో మాట్లాడి ఆరా తీశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఎప్పటికప్పుడు రేవులను శుభ్రంగా వుంచాలని సిబ్బందికి సూచించారు. భక్తులు నది లోతులోకి వెళ్లకుండా రేవు వెంబడి బోట్లను అడ్డం పెట్టించి గజ ఈతగాళ్లను పెట్టించగా వాటిని కమిషనర్ పరిశీలించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని, రాత్రి పూట కూడా భక్తులకు ఇబ్బంది కలుగకుండా విద్యుత్ దీపాలు వుండాలని కార్పొరేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఇదిలా ఉండగా కమిషనర్ రాహుల్‌మీనా నగరంలోని గోరక్షణ పేటలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. అందుకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్య విద్యార్థినుల దీపాలంకరణలు

రాజమహేంద్రవరం కల్చరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక గౌతమి, సరస్వతీ ఘాట్లలో ఆదిత్య మహిళా కళాశాల విద్యార్థినులు శివలింగం, సరస్వతీ బొమ్మ, ఓంకారం, శ్రీకారం వంటి ఆకారాల్లో దీపాలను అలంకరించారు. తదుపరి సరస్వతి ఘాట్లో దీపాలలో వత్తులు వేసి, నూనె పోసి, భక్తులకు పున్నమి వెలుగులు సిద్ధం చేశారు. ఘాట్ అధ్యక్షుడు తోట సుబ్బారావు, వాకర్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్వీ గంగిరెడ్డి, జీవీఎస్ నాగేశ్వరరావు, బీహెచ్ రమాదేవి, పి.సాయి, ఎ.శిరీష, ప్రిన్సిపాల్ సీహెచ్ ఫణికుమార్ పాల్గొన్నారు.



బిక్కవోలు గోలింగేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



అనపర్తి అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న మహిళలు

సామూహిక కుంకుమ పూజలు

అనపర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా అనపర్తిలోని అయ్యప్ప ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. 600మంది మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. సూర్యశ్రీ రైస్ మిల్ అధినేత పోతంశెట్టి ఈశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పడిపూజ వైభవంగా నిర్వహించారు. అలాగే పాతవూరు శివాలయం, జనార్దన స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. శివాలయం వద్ద జ్వాలా తోరణం కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పలు ఆలయాల వద్ద దీపాలు ఏర్పాటు చేశారు.

ఆలయాల్లో జ్వాలాతోరణం

దివాన్ చెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా పాతతుంగపాడు, దివాన్ చెరువు, సంపత్‌నగరం తదితర గ్రామాల్లోని శివాలయాల వద్ద బుధవారం కార్తీక మాసంలో అత్యంత విశిష్టమైన జ్వాలాతోరణం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఆలయాల వద్ద నిలువుగా రెండు కర్రలు పాతి దానికి అడ్డంగా మరోకర్రను కట్టి ఆకర్రకు కొత్తగడ్డిచుట్టారు. దానిపై నెయ్యిపోసి మంట వెలిగించారు. పల్లకిలో ఉంచిన పరమశివుడి ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఉంచి దాని కింద నుంచి అటూ, ఇటూ మూడుసార్లు ఊరేగించారు. కొందరు భక్తులు స్వామితో బాటు జ్వాలా తోరణం కింద నుంచి తిరిగారు. జ్వాలాతోరణం కాలిపోగా మిగిలిన గడ్డిని ఇంటికి తెచ్చుకుని భద్రపర్చుకున్నారు. అలాగే పవిత్రస్నానాలను ఆచరించిన భక్తులు వేకువఝాము నుంచే శివాలయాలకు వెళ్లి నెయ్యి, నూనె దీపాలను వెలిగించారు. కొందరు దీపదానం చేశారు. మరికొందరు రోజంతా ఉపవాస ఉండి చంద్రదర్శనం అనంతరం ముగించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి: నల్లమిల్లి



బిక్కవోలులో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి

బిక్కవోలు/అనపర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఆయన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తేతలి సుమ అధ్యక్షతన క్యాడర్ కోసం నల్లమిల్లి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూటమి నాయకులు రంగాపురం, కొంకుదురు, బిక్కవోలు, పందలపాక, ఆర్ఎస్ పేట గ్రామాల్లో విద్యుత్ లోటెజ్జి, తుమ్మలపల్లి, ఇళ్లపల్లిపాకలు గ్రామాల్లో పారిశుధ్యం, బలభద్రపురం శివారు మామిడితోటలోని కుటుంబాలకు తాగునీటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. దీంతో సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమం అనంతరం క్యాడర్‌తో గంటన్నరకు పైగా సమావేశమై వారి సమస్యలను, అభిప్రాయాలను తెల్సుకుని తగు సూచనలిచ్చారు. కాగా సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి మంగళవారం లండన్‌లో ప్రతిష్టాత్మక ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్స్ (ఐవోడీ) సంస్థ నుంచి ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ హోదాలో అవార్డు అందుకున్న సందర్భంగా కార్యాలయంలో కేకు కట్ చేశారు. ఇదిలా ఉండగా ఇటీవల రంగంపేట మండలం సింగంపల్లికి చెందిన కురుమల్ల వీరబాబు అనపర్తి మండలం కొప్పవరంలోని సూర్యశ్రీ రైసుమిల్లులో ధాన్యం బస్తాలు పడి మృతి చెందాడు. దీంతో ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి చొరవతో మిల్లు యాజమాన్యం ఇచ్చిన రూ.7లక్షల నగదును బిక్కవోలు ఎంపీపీ కార్యాలయంలో వీరబాబు కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

బిక్కవోలులోని రైతు భరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నల్లమిల్లి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్వింటాలు ఏగ్రేడు ధాన్యం రూ.2389, సాధారణ రకం రూ.2369కు ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు.రైతు ప్రభుత్వానికి విక్రయించిన 24 గంటల్లోగా ధాన్యం సొమ్ము వారి బ్యాంకు ఖాతాలకు జమవుతుందన్నారు.కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్‌పర్సన్ జుత్తుక సూర్యకుమారి, సొసైటీ అధ్యక్షుడు పడాల సూర్యనారాయణరెడ్డి, పాలచర్ల శివప్రసాద్‌చౌదరి, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, డీవీఆర్, చింతా శ్రీనివాసరెడ్డి, చవ్వాకుల కృష్ణబాబు, పడాల వెంకటరామారెడ్డి, బేరా వేణమ్మ, పల్లి వాసు, సింగారపు రామారావు, గొర్రెల త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలులో క్యాడర్ కోసం నల్లమిల్లి

వన సమారాధనలతో స్నేహభావం

అనపర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వన సమారాధనల ద్వారా ప్రతిఒక్కరిలో స్నేహ భావం పెంపొందాలని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం అనపర్తి శివారు కొత్తూరులోని కర్రి వెంకన్న తోటలో మండల పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్తీక వన సమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ఉసిరి చెట్టుకు పూజలు నిర్వహించారు. సహపంక్తి భోజనాల్లో పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సీఎం చంద్రబాబు సతీమణి భువనేశ్వరి లండన్‌లో ఐవోడీ సంస్థ నుంచి ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ హోదాలో అవార్డు అందుకున్న సందర్భంగా ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆమె తండ్రికి తగ్గ తనయగా నిలిచారన్నారు. కార్యక్రమాల్లో టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్ రెడ్డి, సిరసపల్లి నాగేశ్వరరావు, తమలంపూడి సుధాకరరెడ్డి, కర్రి శేషారత్నం, దత్తుడు శ్రీను, మల్లిడి ఆదినారాయణరెడ్డి, కూటమి నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మెట్లు నుంచి జారిపడి

టీడీపీ కార్యకర్త మృతి

కడియం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమగిరిగట్టుకు చెందిన టీడీపీ కార్యకర్త పోలవరపు సుబ్బారావు(59) మృతి చెందాడు. కుటుంబీకుల వివరాల ప్రకారం.. సుబ్బారావు ఇంటి మెట్లు ఎక్కుతుండగా అదుపుతప్పి జారిపడిపోయాడు. గాయాలపాలవ్వడంతో కడియం సీహెచ్‌సీకి, అక్కడి నుంచి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. కాగా సుబ్బారావు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

రంగంపేట, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రంగంపేటలో చిన్నకొత్తూరు ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుంచి దండు గంగమ్మ గుడి వరకు రూ.15 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి టీడీపీ నాయకుడు ఉండవిల్లి గిరిబాబు బుధవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మండవిల్లి గుప్త, గారపాటి రాంబాబు, పోతుల సత్యనారాయణ, గారపాటి శ్రీనివాస్, మల్లిపూడి మల్లిబాబు, ఉండవిల్లి శ్రీను పాల్గొన్నారు.

వెదుళ్లపల్లి హైస్కూల్లో

భోజనశాల ప్రారంభం



సీతానగరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదుళ్లపల్లి జడ్పీ హైస్కూల్లో భోజనశాలను సర్పంచ్ పెందుర్తి బుజ్జియ్యచౌదరి ప్రారంభించారు. బుధవారం హైస్కూల్లో ప్రాలిఫిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత బొల్లి సత్యనారాయణ రూ.6 లక్షల వ్యయంతో నిర్మించిన భోజనశాలను ప్రారంభించారు. గతంలో పాఠశాలను దత్తత తీసుకున్న సత్యనారాయణ ఇప్పటికే సైన్స్ ల్యాబ్, స్టాఫ్‌రూమ్‌లను నెలకొల్పారు. కార్యక్రమంలో విద్యాకమిటీ ఛైర్‌పర్సన్ పడాల వరలక్ష్మి,హెచ్‌ఎం ఎస్‌వీవీ సత్యనారాయణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పేదల వైద్యానికి సీఎంఆర్‌ఎఫ్‌తో భరోసా

- ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- లబ్ధిదారులకు రూ.11.89 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వైద్య ఖర్చులు భారమైన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధిని అందజేస్తూ కొండంత భరోసాగా సీఎం చంద్రబాబు నిలుస్తున్నారని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో నియోజకవర్గం పరిధిలోని 15 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.11.89 లక్షల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తోందన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవలో లేని అనేక రకాల చికిత్సలకు లక్షలు ఖర్చు చేసి ఇబ్బందులు పడుతున్న పేద, మధ్య తరగతి కుటుంబాలకు సీఎం సహాయ నిధి అండగా నిలుస్తోందన్నారు.కూటమి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ పరిధిలోని 226 మంది లబ్ధిదారులకు రూ.2,56,77,183 చెక్కులను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా అందజేశామని తెలిపారు. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల వరకు ఇన్సూరెన్స్ పథకం ఈ ఏడాది నుంచి అమల్లోకి తీసుకొస్తున్నట్టు చెప్పారు. కార్యక్ర మంలో ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, మత్యేటి ప్రసాద్, దండమూడి తేజా, విన్నమరెడ్డి ఈశ్వరుడు, ఎంఎస్ఆర్ శ్రీను, నిచ్చన కోళ్ల సత్తిబాబు, బొప్పన శ్రీను పాల్గొన్నారు.

సీసీ డ్రైన్ల నిర్మాణ శంకుస్థాపన

రాజమహేంద్రవరం కార్పొరేషన్ 20వ వార్డులోని గౌతమి వీధిలో రూ.9 లక్షల వ్యయంతో సీసీ డ్రైన్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గోరంట్ల శంకుస్థాపన చేశారు. గౌతమి వీధి, భారతీ వీధి, అన్నపూర్ణ వీధిలో సీసీ డ్రైన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్టు చెప్పారు. ప్రతీ కాలనీలో మురుగునీటి పారుదల, సౌకర్యవంతమైన రహదారులు,పుష్కలమైన తాగునీరు, మెరుగైన విద్యుత్ వ్యవస్థకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సరికొత్త హ్యుండై వెన్యూ ఆవిష్కరణ



హ్యుండై వెన్యూ ఆవిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రముఖ కార్ల కంపెనీ హ్యుండై మోటార్స్ ఇండియా లిమిటెడ్ ఆల్ న్యూ వెన్యూ సరికొత్త డిజైన్, స్టైల్, ఇంటీరియర్ అండ్ ఎక్స్‌టీరియర్ మార్పులతో మార్కెట్లోకి విడుదలైంది. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలోని లక్ష్మి హ్యుండై షోరూంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ చేతులమీదుగా వెన్యూను ఆవిష్కరించారు.కార్యక్రమంలో లక్ష్మి గ్రూప్ రాజమండ్రి హెడ్ ఆఫ్ ఆపరేషన్స్ ఆర్ఎస్‌వీ సునీల్ కుమార్, మనోజ్.బి(ఆర్‌పీఎస్‌ఎం, హెచ్‌ఎంఐఎల్), సిబ్బంది వీరేష్, గోపి, రవికుమార్, కోటేశ్వరరావు, దుర్గారావు, సుమంత్ పాల్గొన్నారు.

హోమియో కళాశాలకు అభివృద్ధికి రూ.3 కోట్లు

కాలేజీ పరిశీలనలో ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, నవం బరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక అల్లు రామలింగయ్య హోమియో కళాశాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చే సేందుకు ప్రభుత్వం రూ.3 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. బుధవారం కళాశాలను పరిశీలించిన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ కళాశాల సీట్లను తగ్గించే ప్రయత్నం చేసి దాదాపు రద్దు చేసే స్థితికి వచ్చినప్పుడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే చర్యలు చేపట్టి సీట్లను పూర్తిస్థాయిలో ఉండేలా చేశామన్నారు. ఇప్పుడు తా జాగా సీట్లు పెంచారన్నారు. నగరంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఇందులో భాగంగా కొద్ది నెలలుగా హోమియో కళాశాల అభివృద్ధికి చర్యలు చేపట్టామని, దీంతో ప్ర భుత్వం తాజాగా రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. దీంతో కళాశాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఖైదీలకు ఉచిత న్యాయ సహాయం

డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి

రాజమహేంద్రవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఖైదీల సమస్యల పరిష్కారానికి ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉందని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం ఆమె కేంద్ర, మహిళా ప్రత్యేక కారాగారాలను సందర్శించారు. ఖైదీలకు అందిస్తున్న ఆహారం, సదుపాయాలను పరిశీలించారు.వైద్య సేవలను సమీక్షించారు. ఖైదీలతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. బెయిల్ పిటిషన్లు, అప్పీలు, ఇతర న్యాయ వ్యవహారాల్లో అవసరమైన సహాయం అందించడానికి సంస్థ సిద్ధంగా ఉందన్నారు.లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సేవలను ఖైదీలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.పారా లీగల్ వలంటీర్ల ద్వారా అర్జీలను పంపించాలన్నారు.

గ్రామాల్లో బీజేపీ ప్రవాస్ యోజన

కడియం, నవంబరు 5(ఆంధ్ర జ్యోతి): బూత్‌స్థాయి నుంచి పార్టీ బలోపేతానికి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ బీజేపీ ప్రవాస్ యోజన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు తెలిపారు. బుధవారం మండలాధ్యక్షుడు బొర్సు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన మండలంలోని వీరవరం, వేమగిరి, కడియపుసావరం, మురమండ, మాధవరాయుడుపాలెం గ్రామాల్లో బీజేపీ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్సీ సోము విచ్చేసి పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. వీరవరంలో తాళాబత్తుల భాస్కర్ ఇంటి వద్ద భోజన కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ ఆకుల శ్రీధర్, తనుబుద్ధి సూర్యభాస్కర్, గుత్తుల హరిప్రసాద్, దాసరి ముత్యం, పులిపే వెంకటేశ్వరరావు, నాగులపల్లి వీరబాబు, పెనుమాక శేషగిరి పాల్గొన్నారు.

సాధారణ సైట్‌ల పరిరక్షణకు చర్యలు

- దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు
- వేరే సర్వే నెంబరుతో 22ఏ జాబితాలో చేర్చితే మేలని కొందరి అభిప్రాయం



మిథులానగర్‌లో సాధారణ సైటు వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

దివాన్‌చెరువు, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు పంచాయతీ పరిధిలోని లేఅవుట్‌లలో ఉండే సాధారణ సైటులు ఆక్రమణకు గురికాకుండా పరిరక్షించుకునేందుకు పంచాయతీ నడుంబిగించింది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతీ లేఅవుట్‌లోను దాని విస్తీర్ణంలో పది శాతం భూమిని సంబంధిత గ్రామ పంచాయతీకి బహుమతిగా కేటాయించాలి. ఈ విధంగా దివాన్‌చెరువు పంచాయతీకి చెందిన సాధారణ సైట్లు ఆక్రమణల బారిన పడకుండా ఉండేందుకు సంబంధిత సైటుల వద్ద తమ పంచాయతీకి అప్పగించిన స్థలమని తెలియజేస్తూ బ్యానర్‌లు ఏర్పాటుచేసే పనిని ప్రారంభించింది. అందులో భాగంగా స్థానిక సర్వే నెంబరు 331/పిలో వేసిన లేఅవుట్‌లో 0.20 సెంట్లు భూమి వద్ద ఈ హెచ్చరిక బోర్డును బుధవారం ఏర్పాటు చేశారు. అయితే ఈ విధంగా పంచాయతీ పరిధిలోని సాధారణ సైట్లుకు వేరే సర్వే నెంబరు కేటాయించి వాటిని 22ఏ జాబితాలో చేర్చితే వేరే వ్యక్తులకు బదిలీ కాకుండా కాపాడుకునేందుకు వీలు ఉంటుందని కొందరు అభిప్రాయ పడుతున్నారు. దివాన్‌చెరువు పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఉన్న జిల్లా జాయింట్ కలెక్టర్ ఈ మేరకు చర్యలు చేపడితే బాగుంటుందని సూచిస్తున్నారు. కాగా ఈ విషయమై కార్యదర్శి కె.హనుమంతరావును ఆంధ్రజ్యోతి సంప్రదించగా దివాన్‌చెరువు పరిధిలో వేసిన లేఅవుట్లలో పంచాయతీకి దఖలు పడిన అన్ని సాధారణసైట్ల వద్ద ఈ విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరు

మెరుగుపరుచుకోవాలి

రాజమహేంద్రవరం సిటీ, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులు సమయపాలన పాటించడంతో పాటు వారి పనితీరు మెరుగుపరుచుకోవాలని కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ వీవీ రామలింగేశ్వర్ సూచించారు. బుధవారం కార్పొరేషన్ కార్యాలయంలో పనితీరు బాగోలేని సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. హౌస్‌హోల్డ్ మ్యాపింగ్, ఆధార్ బయోమెట్రిక్ అప్డేట్, కౌశలం తదితర సర్వేల వివరాలు నమోదు చేయడంలో ఎందుకు తాత్సరం జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుకు ఈ సర్వేలు ఎంతో ముఖ్యమని, వాటి ద్వారానే అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల అమలుతో పాటు ఇతర ప్రభుత్వ సేవలు, వర్తిస్తాయన్నారు. కనుక ప్రభుత్వానికి అనుగుణంగా సచివాలయ సిబ్బంది పనిచేయాలని అడిషనల్ కమిషనర్ రామలింగేశ్వర్ సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో సెక్రటరీ శైలజవల్లి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: బాహుబలి
సూర్యమినీ	: డ్యూడ్
సూర్యప్యాలస్	: బైసన్
స్వామి	: బాహుబలి
అనుశ్రీ(సాయికృష్ణ)	: కె-ర్యాంప్
శివజ్యోతి	: బాహుబలి
రాజా	: మాస్‌జాతర
ఊర్వశి	: తెలుసు కదా
మేనక	: కాంతారా-1
రంభ	: మాస్ జాతర
అప్సర	: మాస్ జాతర
అశోక	: మాస్ జాతర
వీఎస్ మహల్(నామవరం)	: మాస్ జాతర
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: మాస్ జాతర
వెంకటసూర్య(కడియం)	: మాస్ జాతర
సత్యగౌరి (అనపర్తి)	: బాహుబలి
సూర్యశ్రీ (అనపర్తి)	: మాస్ జాతర
ఫార్ఛ్యూన్ సినిమాస్(రాజానగరం)	: మాస్ జాతర
రామకృష్ణ(కోరుకొండ)	: కాంతారా-1
గీతాసినిమాస్ (సీతానగరం)	: కాంతారా-1
శ్రీనివాస (గోకవరం)	: మాస్ జాతర
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: బాహుబలి
లలితామహాల్(రంపచోడవరం)	: కె-ర్యాంప్
నవయుగ(చింతూరు)	: కె-ర్యాంప్



అన్నవరం వద్ద హైవేపై గిరి ప్రదక్షిణ వ్యూ.. పిల్లాడితో కలిసి ప్రదక్షిణ..





కార్తీక పౌర్ణమి సందర్భంగా రాజమహేంద్రవరం పుష్కర ఘాట్ వద్ద ఉన్న భారీ శివలింగం మీదుగా కనిపించిన సూపర్ మూన్.. గోదావరి పుష్కర ఘాట్‌లో పౌర్ణమి స్నానాలు.. పుష్కర ఘాట్‌లో గోదావరికి కార్తీక పౌర్ణమి హారతి





కనుల పండువగా..

కార్తీక దీపోత్సవం

- గోదావరి ఘాట్లలో వేలాది మంది భక్తుల పుణ్యస్నానాలు
- కిక్కిరిసిన పంచారామాలు

అత్యంత పవిత్రంగా భావించే కార్తీక మాసంలో పౌర్ణమి విశిష్టత అందరికీ తెలిసిందే. శుక్ల పక్షంలో పున్నమి తిథి కలిగిన ఈ పదిహేనో రోజును హరి, హరులకు ప్రీతికరమైందని భక్తుల విశ్వాసం. ఈసారి కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భక్తులు వేకువజామునే స్నానాదులు చేసి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. గోదావరి, కాలువలు, పుష్కరిణిల్లో దీపాలు వదిలారు. నోములు ఉన్నారు. రాత్రికి అనేక చోట్ల జ్వాలాతోరణం కార్యక్రమాలు నిర్వహించారు. పంచారామాలతోపాటు కోటిపల్లి, రాజమహేంద్రవరం గోదావరి, అన్నవరం, పిఠాపురం ఇలా అన్ని ముఖ్యమైన ప్రాంతాల వద్ద కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు.



పెరవలిలో 'చంద్ర'కాంతులు



పుష్కర ఘాట్‌లో దీపారాధన

జై సత్యదేవా..



అన్నవరంలో గిరిప్రదక్షిణ

- స్వామి నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు
- కనుల పండువగా గిరి ప్రదక్షిణ
- రెండు లక్షల మంది హాజరు
- ఘనంగా పంపా హారతులు, జ్వాలాతోరణం



పంపానదికి కార్తీక పౌర్ణమి హారతి →



8



పర్యాటకం పరుగు



- ప్రకృతి ఒడిలో విహారం.. వినోదం..
- కేరళ తరహాలో ఏర్పాట్లు
- ఉమ్మడి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ముందడుగు
- టెండర్లు పిలిచిన పర్యాటక శాఖ
- ఇప్పటికే కేరళ టూరిజం బృందాల పరిశీలన
- తూర్పు, కోనసీమల్లో హౌస్‌బోట్లు.. కాకినాడ బీచ్ పర్యాటకం.. ఏజెన్సీలో ట్రెక్కింగ్‌కు ఏర్పాట్లు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరిలోని ప్రకృతి వనరులను ఒడిసి పట్టుకొని పర్యాటకపరంగా అభివృద్ధి చేయడానికి కూటమి ప్రభుత్వ చొరవతో పర్యాటక శాఖ పరుగు పెడుతోంది. ఇప్పటికే ఎక్కడికక్కడ పర్యాటకులకు ఏర్పాట్లు ఉన్నా.. వాటిని మరింత మెరుగ్గా ఆధునిక ప్రమాణాలతో తీర్చిదిద్దనున్నారు. మధురపూడి విమానాశ్రయంలోని రెండో టెర్మినల్ శరవేగంగా నిర్మాణం జరుగుతోంది. రైలు ప్రయాణికులకు గేట్‌వేగా రాజమహేంద్రవరం ఉంది. పర్యాటకుల సునాయాస ప్రయాణానికి మరింత కూడలిగా అవతరించనుంది. ఇక కోనసీమ అందాలు కేరళను తలపిస్తాయి. కాకినాడ బీచ్ విదేశాల్లో విహరించిన అనుభూతి కలిగిస్తుంది. మరోవైపు మారేడుమిల్లి ఏజెన్సీ అందాలను ఆస్వాదించడానికి ఇప్పటికే పర్యాటకులు క్యూకట్టారు. ఆధ్యాత్మిక టూరిజం సరేసరి. ఇప్పుడు వీటన్నిటినీ వినియోగించుకొని పర్యాటక సర్క్యూట్‌గా పుష్కరాల నాటికి అందుబాటులోకి తీసుకొచ్చే ప్రయత్నం వేగంగా జరుగుతోంది. అన్నీ అనుకున్నట్టు జరిగితే గోదావరి పర్యాటకానికి మహర్దశ పట్టినట్టే.

● అలెప్పీ వెళ్లక్కర్లే..

హౌస్‌బోట్లకు కేరళలో అలెప్పీ(అళప్పుజ) ప్రసిద్ధి. ఇకపై అక్కడికి వెళ్లాల్సిన అవసరం ఉండకపోవచ్చు. ఆ అనుభూతిని ఇక్కడే ఆస్వాదించొచ్చు. గోదావరి, వేమగిరి-ధవళేశ్వరం కాలువ, కొవ్వూరు పరీవాహక ప్రాంతాల్లో హౌస్‌బోట్ల ఏర్పాటుకు పర్యాటకశాఖ టెండర్లు పిలిచింది. కేరళకు చెందిన టూరిజం సంస్థల ప్రతినిధులు ఇప్పటికే ఇక్కడ ప్రదేశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే స్థానికంగా ఆపరేటర్లు ఉంటే వాళ్లకు తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. కేరళ, బెంగళూరు వంటి ప్రాంతాల్లోని పెద్ద ఆపరేటర్లతో కలిసి పనిచేసినా స్థానికంగా మేలు జరుగుతుంది. హౌస్‌బోట్లు సింగిల్ రూమ్ లేదా డబుల్ రూమ్ విధానంలో ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం పగటిపూట మాత్రమే నడుపుతారు. టూరిజం పాలసీ ప్రకారం రాయితీలు ఉంటాయి. ఇరిగేషన్ తదితర అనుమతులకు టూరిజం శాఖ సహాయ పడుతుంది. హౌస్‌బోట్లలో ఫుడ్ సదుపాయమూ ఉంటుంది. బోటుకు సుమారు రూ.30 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకూ ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు. ఆయా సంస్థలు, అవి అందించే సదుపాయాలకు అనుగుణంగా ధరలను నిర్ణయిస్తారు. ఒక్కో బోటుతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50మందికి ఉపాధి లభిస్తుంది.

● జల క్రీడలు..

కడియం, నిడదవోలు కాలువలు, గోదావరి లంకల్లో జల, సాహస క్రీడల టూరిజానికి ప్లాన్ చేశారు. జిప్‌లైనర్, ఎయిర్ బెలూన్స్, లాంగ్ జంప్‌లు, స్కూబా డ్రైవ్, రోప్ వే, స్పీడ్ బోట్లు వంటివన్నీ వస్తాయి. గోదావరి లోతు పుష్కర్ ఘాట్ నుంచి సరస్వతీ ఘాట్ వరకూ 30 అడుగుల లోతు ఉంటుంది. అందువల్ల హౌస్‌బోట్లు, అడ్వంచర్ పర్యాటకానికి అనుకూలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు ఇసుకపై వెళ్లే వాహనాలు కేటీఎం వాహనాల వంటివి కూడా తీసుకొస్తారు. ఇసుక తిన్నెల్లో టెంట్‌లతో వసతి ఏర్పాటు చేస్తారు. హేవలాక్ బ్రిడ్జి(పాత రైలు వంతెన)ని 2016లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రైల్వేకు డబ్బు చెల్లించి రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసింది. అయితే తర్వాత ప్రక్రియ ఆలస్యం కావడం, ప్రభుత్వం మారడంతో వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చా కేంద్ర ప్రభుత్వం రూ.46 కోట్లు మంజూరు చేసింది. హేవలాక్ బ్రిడ్జిపై బ్యూటిఫికేషన్, అటూ ఇటూ షావనీర్ షాప్స్, ఫుడ్ ఐటమ్స్ వంటివన్నీ వస్తాయి. ప్రతి స్తంభం దగ్గర రౌండ్ సర్కిల్‌ని కడతారు. అక్కడ కూర్చుని గోదావరి గాలిని ఆస్వాదించొచ్చు. ఈ వంతెనపై ఉండే నడకదారిపై నడిచి వెళ్లి బ్రిడ్జిలంకలో దిగి అక్కడి నుంచి బోటులో పుష్కర్‌ఘాట్ చేరుకొనేలా ప్లాన్ చేశారు. అయితే బ్రిడ్జికి సంబంధించి పుష్కర్‌ఘాట్ వద్ద ప్రవేశంలో 1044 చదరపు మీటర్ల స్థలం రైల్వే నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ కావాల్సి ఉంది. దీనిపై కూడా ప్రభుత్వం దృష్టి సారించడంతో త్వరలోనే ఆ పని కూడా పూర్తి అయ్యే అవకాశం ఉంది.

కోనసీమ, కాకినాడల్లో...

కాకినాడలో ప్రత్యేకంగా బీచ్‌లను అభివృద్ధి చేసి బీచ్ టూరిజాన్ని మెరుగుపరుస్తారు. బీచ్ వాలీబాల్, స్లైలాంతర్లు వంటివి ఏర్పాటు చేయనున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమలోని దిండి, పాశర్లపూడి బ్యాక్ వాటర్స్, అప్పనపల్లి దగ్గర, యానాం, గోగుల్లంక ఫెర్రీల్లో హౌస్‌బోట్లు, వసతి ఏర్పాటుచేస్తారు. ఏజెన్సీకి సంబంధించి రంపచోడవరం, మారేడుమిల్లిలో ట్రెక్కింగ్, జంగిల్ టూరిజాన్ని అభివృద్ధి చేస్తారు. ఇప్పటికే మారేడుమిల్లిలో ఆ తరహా వసతులు కొంతవరకు ఉన్నాయి.

● ప్రతిపాదనలకు ఆహ్వానం

పర్యాటక అభివృద్ధి కోసం టూరిజం శాఖ ప్రతిపాదనలకు ఆహ్వానం పలికింది. ఆసక్తి ఉన్న వారు టూరిజం వెబ్‌సైటులో బిడ్లను పరిశీలించవచ్చు. జలక్రీడలు, సాహస క్రీడలు, లగ్జరీ హౌస్ బోట్లు, పార్టీ బోట్లు ఏర్పాటు చేసి నిర్వహించాల్సి ఉంటుంది. సంస్థలు, వ్యక్తులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. మరిన్ని వివరాలు www.tourism.ap.gov.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి. పర్యాటక అధికారులను 9505011951, 6309942025 నెంబర్లలో సంప్రదించవచ్చు.

● పుష్కరాల కంటే ముందే..



పర్యాటకపరంగా పుష్కరాల కంటే ముందుగానే ఓ రూపు తీసుకొచ్చి ఏర్పాట్లను అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం. స్థానికంగా కూడా ప్రాధాన్యం ఇస్తాం. పర్యాటకం అభివృద్ధి అయితే స్థానికులకు పెద్ద సంఖ్యలో ఉపాధి లభిస్తుంది. ఇక్కడి రుచులు, సంస్కృతి ప్రపంచానికి పరిచయం అవుతాయి. పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఆ దిశగా అభివృద్ధికి కృషి చేస్తున్నాం.

- పి.వెంకటాచలం, జిల్లా పర్యాటక అధికారి, తూర్పుగోదావరి



అయినవిల్లిలో రిసార్ట్‌ను పరిశీలిస్తున్న కోనసీమ కలెక్టర్

హోమ్‌స్టేలతో పర్యాటకులకు కొత్త అనుభూతి : కోనసీమ కలెక్టర్

అమలాపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హోమ్ స్టే విధానం వల్ల పర్యాటక రంగంలో స్థానిక ప్రజల జీవనశైలి, ఆచారాలు, సంప్రదాయాలు, వంటకాలు, సాంస్కృతిక వారసత్వాన్ని పర్యాటకులు ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం ఉంటుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. అయినవిల్లి, అల్లవరం మండలంలో కలెక్టర్ బుధవారం పర్యటించారు. అల్లవరం మండలం గూడాల గ్రామంలో పొల్లేటి సాయి మండవ ఇళ్లు, ముక్తేశ్వరం విళ్ల దొరబాబుకు చెందిన అయినవిల్లి కోనసీమ విల్లా రిసార్ట్స్ పురాతన మండువ లోగిళ్లను ఆయన సందర్శించి హోమ్‌స్టేకు అనువైన వసతులు ఏమేరకు ఉన్నదీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోమ్‌స్టే విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని, ఆ దిశగా కోనసీమలో ఉన్న పురాతన, సంస్కృతీ సంప్రదాయాలను ప్రతిబింబించే మండువా లోగిళ్లను గుర్తించడం జరుగుతోందన్నారు. హోమ్‌స్టే ద్వారా స్థానిక ఆదాయ వృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ముఖ్యంగా పర్యాటకులు ఓ ప్రాంతంలోని అసలైన జీవన విధానాన్ని అనుభవిస్తారన్నారు. సాంస్కృతిక మార్పిడి, స్థానిక కళలు సంగీతం, నృత్యం, పండుగల విశిష్టతలను దగ్గరగా తెలుసుకోవచ్చన్నారు. సంప్రదాయాలపై పర్యాటకుల ఆసక్తి వల్ల స్థానికులు తమ సంస్కృతిని మరింత ఉత్సాహంగా కొనసాగించడానికి కారణమవుతుందన్నారు. అలాగే సాధారణ హోటల్ బసకు భిన్నంగా హోమ్‌స్టేలు నిజమైన స్థానిక అనుభూతిని అందిస్తాయనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదన్నారు. సుస్థిర పర్యాటకంతోపాటు ప్రకృతితో సఖ్యత కలిగిన పర్యావరణానికి హాని లేని రీతిలో పర్యాటకులు పూర్వపు సంప్రదాయ సాంస్కృతిక వారసత్వపు అనుభూతిని అందించడంలో ఒక సమర్థమైన సాధనమన్నారు. కలెక్టర్ వెంట డీఆర్వో కె.మాధవి, జిల్లా పర్యాటక అధికారి అన్వర్ ఉన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ కీర్తి చేకూరి

విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలు పెంచాలి

- మౌలిక సదుపాయాలను పూర్తిచేయాలి
- 'విద్యా శక్తి' కింద సృజనాత్మక శక్తిని పెంపొందించాలి
- సమీక్షలో కలెక్టర్ కీర్తి

రాజమహేంద్రవరం,నవంబరు5(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను గుర్తించి వాటిని పెంపొందించే విధంగా ఉపాధ్యాయులు, అధికారులు కృషి చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్, వొకేషనల్, ఎస్ఎస్ఏ, మౌలిక సదుపాయాలు, పెండింగ్ పనులు, ఐసీడీఎస్ అంగన్వాడీలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రతిపాదనలు సిద్ధంచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పిల్లల్లో సృజనాత్మకశక్తి పెంచే విధంగా చదవడం, రాయడం సరిగా రాని విద్యార్థులకు 'విద్యాశక్తి' కార్యక్రమం కింద సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించి బోధన చేయాలన్నారు. పాఠశాలల్లో డ్రాప్ అవుట్స్ ఉండడానికి వీల్లేదన్నారు. వెల్ఫేర్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ల ద్వారా పాఠశాలలకు రాని వలస పిల్లలను గుర్తించి సమీప పాఠశాలల్లో చేర్పాలన్నారు. జిల్లాలో 1 నుంచి 12వ తరగతి వరకు ఇంకా 6 వేల మంది విద్యార్థులకు అపార్ ఐడీ లేదని, వారందరికీ తక్షణమే ఐడీలను క్రియేట్ చేయాలన్నారు. అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ద్వారా విద్యార్థులు ప్రయోగాత్మకంగా అభ్యసించే విధంగా చర్యలు చేపట్టాలని ఆమె సూచించారు. తల్లికి వందనం పథకం కింద సాంకేతిక కారణాల వల్ల నిధులు జమకాని లబ్ధిదారుల జాబితాను గ్రామ/వార్డు సచివాలయాలతో సమన్వయం చేసి సిద్ధంచేయాలన్నారు. ఆ సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనం రుచి, శుచిగా ఉండాలన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులై ఇంకా ఇంటర్మీడియట్‌లో చేరని విద్యార్థులను గుర్తించి అందుకు కారణాలను వివరంగా నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 8వ తరగతి నుంచే ఐఐటీ శిక్షణ అందించే అంశాన్ని పరిశీలించాలన్నారు. అవసరమైన పాఠశాల భవనాల పనులను త్వరితగతిన పూర్తి చేయలన్నారు. స్కూల్ గ్రాంట్స్ వినియోగం సక్రమంగా ఉండాలని చెప్పారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుకొనే ప్రతిభావంతులైన విద్యార్థులను గుర్తించి వారికి ప్రోత్సాహకాలను అందించాలన్నారు. నీట్, జేఈఈ మెయిన్స్‌కి సిద్ధం చేయాలన్నారు. ఇంటర్‌లో మెరుగైన ఫలితాల కోసం 69 మంది వొకేషనల్ టీచర్ల నియామకం ప్రక్రియ జరుగుతోందని కలెక్టర్‌కు అధికారులు వివరించారు. పీఎం శ్రైమింగ్ రైజ్ ఆఫ్ ఇండియా పథకం కింద 26 పాఠశాలలకు అనుమతులు లభించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న వాటిని సమీప ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేసే విధానంలో మార్గదర్శకాలను అనుసరించి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో వాసుదేవరావు, ఎస్ఎస్ఏ పీడీ సుబాషిణి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

తాడిపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

8

14న టీటీడీ ఆధ్వర్యంలో గోదావరి హారతి

8



రాజమహేంద్రవరం జీజీహెచ్ సందర్శనలో భాగంగా వైద్యసేవల కోసం వచ్చిన వారితో మాట్లాడుతున్న సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

క్యాజువాలిటీ నైట్ షిఫ్టుల్లో ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలి : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నైట్‌షిఫ్టుల్లో రాత్రిపూట విధులు నిర్వర్తించే వైద్యులు, ఉద్యోగులు పద్ధతి మార్చుకోవాలని, రోగులకు వైద్యసేవలు అందించే విషయంలో నిర్లక్ష్యం చూపిస్తే చర్యలు తప్పవని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. బుధవారం రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనాసుపత్రి (జీజీహెచ్)ను సందర్శించిన ఆయన ఆసుపత్రి అధికారులతో మాట్లాడి రోగులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడుతూ జీజీహెచ్‌లో 24 గంటలూ వైద్యసేవలు అందించాలన్నారు. రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ఎప్పటికప్పుడు సమీక్ష చేస్తున్నామని, అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రేడియాలజిస్ట్ పోస్టు భర్తీ చేసి సమస్య పరిష్కరించామని, న్యూరో విభాగంతోపాటు, ఎంఆర్ఐ విషయంలో కొంత ఇబ్బంది ఉందని, త్వరలోనే వాటిని కూడా సరిచేస్తామన్నారు. నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ బ్లాకు భవనాన్ని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ చేతులమీదుగా జనవరిలో ప్రారంభిస్తామన్నారు. అలాగే మార్చురీ నుంచి వచ్చే దుర్గంధం సమస్యకు శాశ్వత పరిష్కారం ఆలోచన చేస్తున్నామని, దీన్ని ఆధునికీకరించి డీప్‌ఫ్రీజర్ వంటివి ఏర్పాటుచేయాల్సి ఉందన్నారు. వీటికి రూ.2 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నామని, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సీఎస్ఆర్ ఫండ్స్ సమీకరించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. తొలుత ఎమ్మెల్యే శ్రీనివాస్‌కు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ పుష్పగుచ్ఛంతో స్వాగతించారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం కృషి

● టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య

కొవ్వూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పేద ప్రజల ఆరోగ్యానికి రాష్ట్రప్రభుత్వం కృషి చేస్తోందని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ సీనియర్ నాయకుడు, ఆంధ్రాసుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) అన్నారు. బుధవారం దొమ్మేరుకు చెందిన నీరుకొండ రంగయ్యకి రూ. 78,112 వేలు, కలగర రామకృష్ణకు రూ. 20,668 వేలు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామకష్ణ, ఉప సర్పంచ్ కలగర సుబ్బారావు, చౌదరి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



చెక్కులు పంపిణీ చేస్తున్న అచ్చిబాబు

తాడిపూడిలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ అధ్యక్షుడు కొండబాబు

తాళ్లపూడి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : తాడిపూడి సొసైటీ పరిధిలోని తాడిపూడి, కుకునూరులో ధాన్యం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ అధ్యక్షుడు నామా కొండబాబు ప్రారంభించి మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర కల్పిస్తూ సకాలంలో రైతుకు డబ్బు చెల్లించే బాధ్యత కూడా తమ కూటమి ప్రభుత్వం తీసుకుందన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే రైతు పండించిన ఆఖరి గింజ వరకూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో గొంతు రమేష్, రంగనాయ కులు, నామన పరమేశ్వరరావు, ఉడతా వీరేంద్ర కుమార్, ఏవో రుచిత, కార్యదర్శి బొర్రా రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న ఆలయాభివృద్ధికి రూ. 25 వేలు విరాళం

దేవరపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీదేవిభూదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయాభివృద్ధికి త్యాజంపూడికి చెందిన కాళ్ల వెంకన్నబాబు,భారతలక్ష్మీప్రభావతి దంపతులు బుధవారం రూ.25 వేల నగదును ఆలయ కమిటీ చైర్మన్ అంబటి శ్రీనివాసరావుకు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తంగెళ్ల శివశంకర్, ఆలయ ప్రధాన అర్చకులు కేశవాచార్యులు, దుర్గాప్రసాద్ ఆచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ కమిటీ చైర్మన్‌కు నగదు అందజేస్తున్న దృశ్యం

రాష్ట్ర స్థాయి పోటీలకు శశి విద్యార్థులు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ షేక్ షానూర్, టీచర్లు

ఉండ్రాజవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవరపల్లిలో ఈనెల 3వ తేదీన నిర్వహించిన 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్ బాల్ పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు వేలివెన్ను శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి రవికుమార్ బుధవారం ఒకప్రకటనలో తెలిపా రు. జిల్లా స్థాయి ఫుట్‌బాల్ అండర్-14 బాలుర విభాగంలో తమ విద్యార్థులు వి. రవి, ఎం. మోక్షజ్ఞ సత్తా చాటడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు ఆయన వివరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు, వ్యాయామ ఉపాధ్యాయులను చైర్మన్ రవికుమార్, వైస్ చైర్మన్ లక్ష్మిసుప్రియ, ప్రిన్సిపాల్ షేక్ షానూర్ అభినందించారు.

పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల కమిటీ

పెరవలి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీఎంపీ వెల్ఫేర్ అసోసియేసన్ మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం జరిగిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా వీరభద్రరావు, అధ్యక్షుడిగా నక్కా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా షేక్‌బాబ్జి, ఉపాధ్యక్షుడిగా జె. సతీష్, సహాయ కార్యదర్శిగా టి. సతీష్, మెంబర్లుగా షేక్ హసీన్, గణేష్, కేశవస్వామి, నరసింహరావు, కేతాసూర్యనారాయణ,వెంకటపతి, కె.శాంతి ఎన్నికయ్యారు.

ఘనంగా కార్తీకమాస పూజలు

● పుణ్యస్నానాలతో కిటకిటలాడిన గోష్పాదక్షేత్రం ● ఆలయాల్లో భక్తుల ప్రత్యేక పూజలు



గోష్పాదక్షేత్రంలో భక్తుల పుణ్యస్నానాలు



నిడదవోలులో ..



చాగల్లు సెంటర్‌లో..

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని పట్టణం, మండలంలోని శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. బుధవారం వేకుమజాము నుంచే భక్తులు గోష్పాదక్షేత్రానికి చేరుకుని గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. ప్రధాన స్నానఘట్టాలలో ఉన్న శివలింగాలకు నదీజలాలతో అభిషేకాలు చేశారు. మహిళలు అరటి డొప్పలలో కార్తీక దీపాలు వెలిగించి నదిలో విడిచిపెట్టారు. క్షేత్రంలోని రావిచెట్టు, తులసికోట, సుందరేశ్వర స్వామి ఆలయంలోని ధ్వజ స్తంభం, నందీశ్వరుని వద్ద మహిళలు అధికసంఖ్యలో కార్తీకదీపాలను వెలిగించారు. అలాగే సుందరేశ్వరస్వామిని దర్శించుకుని పంచామృతాభిషేకాలు నిర్వహించారు. పండితులకు సాలగ్రామ, దీపదానాలు సమర్పించారు. క్షేత్రంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పట్టణ సీఐ పి.విశ్వం ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు, మున్సిపల్ కమిషనర్ సీహెచ్.వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో పారిశుధ్యాన్ని తొలగించారు. అలాగే కార్తీకపౌర్ణమిని పురస్కరించుకుని గోదావరిమాతకు మహానీరాజనం అందజేశారు. గోదావరిమాత విగ్రహం వద్ద గోదావరి నీరాజన సమితి అధ్యక్షులు కలిగొట్ల కృష్ణారావు ఆధ్వర్యంలో 242వ మాసోత్సవ మహానీరాజనం అందజేశారు. కార్యక్రమంలో ఇనుగంటి ఉమారామారావు, డీఆర్ఎస్ఎస్.శాస్త్రి, అనుపిండి చక్రధరరావు, పట్టణ, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

నిడదవోలు: పట్టణంలో వేంచేసివున్న శ్రీ రాజరాజేశ్వరి సమేత గోలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా గోలింగేశ్వరస్వామికి విశేష అభిషేకాలు రాజరాజేశ్వరి దేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. పవిత్ర కార్తీకమాసం కార్తీక పౌర్ణమి కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయంలో కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో ఆలయం భక్తుల శివనామ స్మరణతో మారుమోగింది.

చాగల్లు: కార్తీకపౌర్ణమిని బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా శివాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చాగల్లు సెంటర్‌లోని శెట్టిబలిజ సంఘ వారి శ్రీసీతా సమేత రామచంద్రస్వామి వారి ఆలయం ప్రాంగణంలో విఘ్నేశ్వర పూజ, బిల్వ పత్ర పూజ, రుద్రాభిషేకం, రుద్రహోమం, తదితర పూజలు జరిగాయి. చాగల్లు శెట్టిబలిజ పెద్ద రామాలయం యువ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పెరవలి: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామునే గోదావరి, కాలువల్లో స్నానాలు ఆచరించి ఆలయాలను దర్శించుకున్నారు. తీపర్రు గోదావరి తీరంలో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద కార్తీక చంద్రుడు ధ్వజస్తంభంపై దర్శనం ఇచ్చారు. దీంతో భక్తులు చూసి తరించారు. అలాగే అన్నవరప్పాడులోని హర హర క్షేత్రాలన్ని మంత్రి దుర్గేష్ కుమారుడు కృష్ణతేజ దర్శించుకున్నారు. అక్కడ కొలువైయున్న స్ఫటిక లింగేశ్వరస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

తాళ్లపూడి: మండలంలోని పలు గ్రామాల భక్తులు కార్తీక పౌర్ణమి సందర్భంగా అఖండ గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేగేశ్వరపురంలో వేంచేసి ఉన్న శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో కైగాల వంశీయుల ఆధ్వర్యంలో తిరణాళ్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల నుంచి విచ్చేసిన భక్తులతో ఆ ప్రాంతమంతా సందడిగా మారింది. తిరణాళ్లలో ఏర్పాటు చేసి వివిధ రకాల అంగళ్లతో ఏర్పాటు చేసి వినోద కార్యక్రమాలతో రద్దీగా మారింది. వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద తిరణాళ్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సుమారు 50 మంది స్పెషల్ ఫోర్స్ బలగంతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

14 న టీటీడీ ఆధ్వర్యంలో గోదావరి హారతి

కొవ్వూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) దాస సాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో అఖండ గోదావరి మాతకు వైభవోపేతంగా మహానీరాజనం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్డీవో రాణీసుస్మిత తెలిపారు. నవంబరు 14వ తేదీన కొవ్వూరు గోష్పాదక్షేత్రంలో నిర్వహించనున్న గోదావరి హారతి ఏర్పాట్లపై బుధవారం ఆర్డీవో కార్యాలయంలో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ జి.దేవకుమార్, తహశీల్దార్ ఎం.దుర్గాప్రసాద్, ఎలక్ట్రికల్ ఏడీ ఎం.కృష్ణనాయక్, పట్టణ సీఐ పి.విశ్వం, ఏజీఆర్‌బీ ఏఈ జి.మణికంటరాజు, మత్స్యశాఖ ఏడీ దిల్షద్, దాస సాహిత్య ప్రాజెక్టు ప్రతినిధులు పంపన త్రిమూర్తులు, కలగర శ్రీనివాసు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో రాణీసుస్మిత



నిడదవోలులో పరిశీలిస్తున్న చైర్మన్ బూరుగుపల్లి శేషారావు

ఆర్వోబీ పనులు పరిశీలించిన బూరుగుపల్లి

నిడదవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్వోబీ పనులు నాణ్యతతో వేగవంతంగా పూర్తి కావాలని రాష్ట్ర స్కిల్ డవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు అన్నారు. బుధవారం పట్టణంలో నిర్మాణంలో ఉన్న ఆర్వోబీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల గోదావరి జిల్లాల వాహనదారుల కల అని అన్నారు. ఆయన వెంట టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు, కార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, బైపే రాజేశ్వరరావు, బి.రామారావు ఉన్నారు.

హర్షవర్ధన్‌కు ప్రథమ స్థానం

నల్లజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదవేగిలో మంగళవారం జరిగిన జిల్లాస్థాయి షార్ట్‌పుట్ పోటీల్లో పుల్లలపాడు హైస్కూల్‌కి చెందిన విద్యార్థి ఈతిచర్ల హర్షవర్దన్ ప్రథమస్థానం సాధించినట్టు పీఈటీ కేవీ వెంకట్రావు గురువారం తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హర్షవర్దన్ మండల స్థాయి పోటీల్లో విజయం సాధించిన తర్వాత జిల్లా స్థాయికి వెళ్లడం జరిగిందని, అనంతరం రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించినట్టు పేర్కొన్నారు. దీంతో టీచర్లు,గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

దివ్యాంగులకు త్రీ వీలర్ మోటారు సైకిళ్లు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ఉచితంగా 1,750 రెట్రోఫిట్ త్రీ వీలర్ మోటార్ సైకిళ్లు అందజేస్తున్నట్టు ఎంపీడీవో టీబీవీ రమణ తెలిపారు. దీనికి అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఏపీడీఏఎస్-సీఏసీ.ఏపీ.జీవోవీ.ఇన్) వెబ్‌సైట్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉండి, రెగ్యులర్ డిగ్రీ, ఆపైన ఉన్నత విద్యనభ్యసిస్తున్న విద్యార్థులు, 10వ తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధితో జీవించేవారు, 18 నుంచి 45 సంవత్సరాల్లోపు వారు, 70 శాతం అంగవైకల్యం ఉన్న వారంతా అర్హులన్నారు.

పంట యజమాన్య పద్ధతులు పాటించాలి

● ఏవో సోమశేఖర్

నల్లజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతులు పంట యజమాన్య పద్ధతులు పాటించి పంటలను కాపాడుకోవాలని ఏవో సోమశేఖర్ అన్నారు. బుధవారం ముసుళ్లకుంటలో పొలంపిలుస్తోంది కార్యక్రమం సర్పంచ్ నందమూరి శారదాదేవి ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ పంటలకు సోకే తెగుళ్లకు నివారణ చర్యలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో నందమూరి రామకృష్ణ, వ్యవసాయశాఖ, ఉద్యానవన శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ కేవీకే దుర్గారావు జన్మదిన వేడుకలు

దేవరపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ అధ్యక్షుడు కేవీకే దుర్గారావు జన్మదిన వేడుకలు బుధవారం అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానుల సమక్షంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బర్త్‌డే కేకును కట్ చేశారు. ఎంపీడీవో సీహెచ్ నాగార్జునరావు, ఈఓపీఆర్డీ రాజారావు, సూపరింటెండెంట్ శాంతి, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ గన్నమని జనార్ధనరావు, వైసీపీ నాయకులు కూచిపూడి సతీశ్, దుగ్గిన గంగాధర్, కడిమి రాజు, కామిశెట్టి దుర్గారావు, కవల శ్రీనివాస్, వెలగా శ్రీనివాస్, దొనెల్లి జానకిరామ్, గడా రాంబాబు, ఆచంట అనసూయ, గడా జగదీశ్ పాల్గొన్నారు.

పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం

నల్లజర్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నిన్ను ప్రేమిస్తున్నాను... వివాహం కూడా చేసుకుంటానని మాయమాటలు చెప్పి ఓ వివాహితను నమ్మించి మోసం చేసిన యువకుడిపై నల్లజర్ల పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదయ్యింది. వివరాలివి.. తెలికిచర్లకి చెందిన మరీదు రామాంజనేయులు తన భర్తతో విభేదాల కారణంగా గత మూడు సంవత్సరాలుగా పుట్టింటి వద్దే ఉంటోంది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన యువకుడు పెళ్లి చేసుకుంటానని చెప్పడంతో శారీరకంగా కలిశారు. ప్రస్తుతం ఆమె గర్భం దాల్చడంతో మొఖం చాటేశాడు. దీంతో పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై దుర్గాప్రసాద్ తెలిపారు.

చెకుముకి పోటీలు

దేవరపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి అంబటి సత్యనారాయణరావు జడ్పీ హైస్కూల్లో మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ పోటీలు బుధవారం జరిగాయి. ఇందులో భాష్యం స్కూల్‌కు చెందిన రెండు టీమ్‌లు ప్రథమ, తృతీయస్థానాలను కైవసం చేసుకున్నట్టు ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు తెలిపారు. చెకుముఖి టాలెంట్ టెస్టులో మొదటి స్థానం సాధించిన జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులు శరణ్య, పీ.మహలక్ష్మి, మనస్వి, తృతీయస్థానం సాధించిన సూర్యశివసీతారామ్, డీ.స్నేహిత్‌రెడ్డి, స్వర ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను జోనల్ ఇన్ చార్జి ఆంజనేయులు ప్రిన్సిపాల్ పేరయ్య నాయుడు, చామ్స్ ప్రిన్సిపాల్ సభాన, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

అవగాహన సదస్సు

గోపాలపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓటర్లకు ఆన్‌లైన్ విధానం ద్వారా సేవలు మరింత చేరువ చేసేందుకు ఎన్నికల కమిషన్ బుక్ ఏ కాల్ విల్ బీఎల్‌వో సౌకర్యాన్ని అందుబాటులోకి తెచ్చిందని తహశీల్దార్ సాయి ప్రసాద్ అన్నారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల కమిషన్ ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశాలతో బుక్ ఏ కాల్ విల్ బీఎల్‌వోలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్, ఏఎస్‌వో జోడాల వెంకటేశ్వరరావు, ఎన్నికల సీనియర్ సహాయకులు నల్లరాజు, వీఆర్వోల సంఘంఅధ్యక్షుడు కాశీం పాల్గొన్నారు.

1133.80 హెక్టార్లలో పంట నష్టం

ఉండ్రాజవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వల్ల మండలంలో 1133.80 హెక్టార్లలో వరి పంటకు నష్టం వాటిల్లినట్టు ఏవో బీ. రాజారావు బుధవారం తెలిపారు. మండలంలోని 15 గ్రామాల్లో 1,784 మంది రైతులకు చెందిన వరి పంట నష్టం జరిగిందన్నారు. దీనిపై క్షేత్రస్థాయిలో సర్వే చేసి నివేదికలను జిల్లా అధికారులు పంపించినట్టు వివరించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 33శాతం కంటే ఎక్కువ నష్టం వాటిల్లిన రైతుల వివరాలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసే ప్రక్రియ పూర్తి చేశామన్నారు.

ప్రతిఒక్కరూ సత్కార్యాలు చేయాలి

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్కార్యాలు చేయడం ద్వారా ఆజన్మాంతం చిరస్థాయిగా నిలిచిపోతామని గోష్పాదక్షేత్రంలోని షిర్డీసాయి ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు గుడివాక శ్రీనివాస్ అన్నారు. నందమూరు రోడ్‌లోని సుందరసాయి కల్యాణ మండపం ప్రాంగణంలో బుధవారం రిటైర్డ్ ఆయుర్వేద వైద్యుడు దండు వేంకటేశ్వర ప్రసాద్, లక్ష్మీకాంతకుమారి ఆర్థిక సహకారంతో నూతనంగా ఏర్పాటుచేసిన ఉచిత మినరల్ వాటర్ ప్లాంటు (ఉచిత శుద్ధ జల ప్రసాద ప్లాంటు)ను ప్రారంభించారు. చనమల సుబ్బారావు, కసిరెడ్డి సీతారామయ్య, డి.సురేష్‌కుమార్, అడపా రాంబాబు, పాలకోడేటి సత్యనారాయణమూర్తి, దూసనపూడి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

'ఆత్మనిర్భర్ భారత్ నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలి'

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆత్మనిర్భర్ భారత్ నినాదాన్ని క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి. నాగేంద్ర అన్నారు. బుధవారం కొవ్వూరు పట్టణంలో బీజేపీ నాయకులతో పట్టణ ఇన్‌చార్జి యెనుముల రంగబాబు సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో బూత్ అధ్యక్షుడు పట్టణంలోని సమస్యలను ఎప్పటికప్పుడు పట్టణ కమిటీకి అందజేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ, తాడిమళ్ల విజయవాణి, నీరుకొండ సూర్యనారాయణ, తురగా విజయభాస్కర్, గెల్లా కేశవ, మడిచర్ల రామచంద్రరాజు, సాయిరాజు, మేడూరి శ్రీనివాస్, అడ్డూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

అమరవీరుల ఆశయాలు కొనసాగిద్దాం : ఈమని

నిడదవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : విప్లవోద్యమంలో అసువులు బాసిన అమర వీరుల ఆశయాలు, త్యాగాలను కొనసాగిద్దామని సీపీఐ (ఎమ్ఎల్) న్యూ డెమొక్రసీ పార్టీ నాయకుడు ఈమని గ్రీష్మకుమార్ అన్నారు. బుధవారం శెట్టిపేటలో నీలం రామచంద్రయ్య, జంపాల చంద్రశేకర్ ప్రసాద్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా ఈమని పాల్గొని మాట్లాడుతూ అమర వీరుల ఆశయాలను ఆచరించడమే వారికి నిజమైన నివాళి అన్నారు. కార్యక్రమంలో నంబూరి శ్రీమన్నారాయణ, ఈమని మల్లిక, నంబూరి మహర్షి, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



శెట్టిపేటలో అమరవీరులకు నివాళి అర్పిస్తున్న న్యూ డెమొక్రసీ పార్టీ నాయకులు, కార్యకర్తలు

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

గోపాలపురం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రైతు సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం నూతన అధ్యక్షుడు దున్నా సీతారామ్ అన్నారు. స్థానిక వ్యవసాయ ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం పాలకవర్గ ఎన్నికలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 15 మంది సభ్యులతో కూడిన పాలకవర్గాన్ని రైతులు ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షునిగా దున్నా సీతారామ్, ఉపాధ్యక్షులుగా శ్రీను, కార్యదర్శిగా గోపరబోయిన రామారావు, సహాయ కార్యదర్శిగా బొల్లారెడ్డి చంద్రశేఖర్, కోశాధికారిగా దేవరపల్లి విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. వీరితో పాటు మరో 10 మందిని పాలకవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఎన్నికైన సభ్యులను మండల టీడీపీ అధ్యక్షుడు కొర్లపాటి శ్రీరామచంద్రరావు, జిల్లా కార్యదర్శి జ్యేష్ఠ శ్రీనివాసరావు పాలకవర్గ సభ్యులను పూలమాలలతో సత్కరించారు.

సమిశ్రగూడెంలో 16.5 కాసుల బంగారం చోరీ

నిడదవోలు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తాళం వేసి ఉన్న ఓ ఇంట్లోని బంగారు ఆభరణాలు దోచుకుపోయారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సమిశ్రగూడెంలో నివాసముంటున్న కాసగాని సత్యనారాయణ భార్యకు ఈనెల 1వ తేదీన పాము కాటు వేయడంతో ఒక ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం చేయిస్తు న్నాడు. ఈ క్రమంలో బుధవారం ఉదయం ఇంట్లో లైట్లు వెలుగుతుండడంతో కాసగాని సత్యనారాయణ అన్న కుమారుడు దుర్గాప్రసాద్ ఫోన్ చేసి ఇంటిలో లైట్లు వెలుగుతున్నాయి వచ్చేశారా అని పలకరించాడు. దీంతో హుటాహుటిన వచ్చిన సత్య నారాయణ ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా సుమారు 16.5 కాసుల బంగారు ఆభరణాలు దొంగలు పట్టుకొని పోయినట్టు గుర్తించి, సమిశ్రగూడెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఎస్సై జె.కల్యాన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్లూస్ టీమ్ ఇంటి నుంచి వేలిముద్రలు సేకరించారు. త్వరలో నిందితుల్ని పట్టుకుంటామని చెప్పారు.

ప్రజల అవసరాలపై ప్రతిపాదనలు అందజేయాలి

● సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ప్రజల అవసరాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రతిపాదనలు అందజేయాలని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అధికారులను ఆదేశించారు. కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో బుధవారం ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయిరాజ్, సర్వశిక్షా అభియాన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మరమ్మతులకు గురయిన రహదారులు, ప్రజలకు అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులకు సంబంధించి ప్రతిపాదనలు తయారుచేసి నివేదికలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డీఈ నెక్కంటి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈలు రాజ్‌తిలక్, సతీష్, సర్వశిక్షా అభియాన్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

అన్నవరం.. భక్తజన సంద్రం..



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

● వేడుకగా సత్యదేవుడి గిరిప్రదక్షిణ

● సత్యదేవ నామస్మరణతో మార్మోగిన రత్న, సత్యగిరులు

అన్నవరం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడు కొలువైన రత్న,సత్యగిరులు బుధవారం జై సత్యదేవ నామస్మరణతో మార్మోగాయి. స్వామి వెలసి భక్తులతో పూజలందుకునే 2 కొండల చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్తీకపౌర్ణమి పర్వదినం సందర్భంగా బుధవారం నిర్వహించిన స్వామివారి గిరిప్రదక్షిణకు రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 2 లక్షల మంది విచ్చేయడంతో అన్నవరం భక్తజన సంద్రమైంది. గతేడాది మాదిరిగా సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను ఉదయం 8.30 గంటలకు పల్లకీలో, సత్యరథం భక్తులతో మధ్యాహ్నం 2గంటలకు గిరియాత్ర ప్రారంభించారు.

సత్యనారాయణకు సత్కారం

ఉండ్రాజవరం, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): చివటం పంచాయతీ కార్యదర్శి జీవీవీ సత్యనారాయణ డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి వచ్చిన సందర్భంగా బుధవారం పాలంగి పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈయన పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలాని బదిలీ అయ్యారు. అత్తిలి డిప్యూటీ ఎంపీడీవోగా జాయిన్ కానున్నారు. ఈ సందర్భంగా పలువురు పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ సీనియర్ ఉద్యోగిగా చేసిన సేవలు తమకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ఎండీ హసన్‌జానీ, టి. రాజకుమార్, జి. ప్రసాదరావు, వంగా శ్రీనివాసరావు, పి. మునసయ్య, పి. శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



సత్కరిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

కొవ్వూరు, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. కొవ్వూరు రెల్లిపేటకు చెందిన యువకులు బుధవారం కాపవరం వెళ్లారు. తిరిగి వస్తుండగా జంక్షన్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లం గణేష్ (22) మృతిచెందగా, ఆకుల ఆనంద్ అలి యాస్ నందు, కోన హేమంత్ తలకు తీవ్ర రక్తగాయా లయ్యాయి. దీంతో వీరిని అత్యవసర వైద్య సహాయం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న కొవ్వూరురూరల్ ఎస్ఐ కె.శ్రీహరి సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి గల కారణాలు సేకరిస్తున్నారు. దీనికి సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



మృతి చెందిన అల్లం గణేష్ (ఫైల్)

మరో ప్రమాదంలో ఇంకొకరు...

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం మెయిన్‌రోడ్డులో హైస్కూల్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్టు ఎస్సై డీ. రవి కుమార్ బుధవారం తెలిపారు. పెరవలి మండలం కానూరుకు చెందిన ఆరుట్ల సూర్యనారాయణ (58)ను ఆర్టీసీ బస్సు ఢీ కొనడంలో అక్కడికక్కడే మృతిచెందాడు. కానూరు నుంచి ఉండ్రాజవరం మీదుగా తణుకు వెళ్లి కిరాణా సరుకులు తీసుకువచ్చేందుకు మోటార్ సైకిల్‌పై వెళుతుండగా, తణుకు నుంచి రాజమండ్రి వైపు వెళుతున్న బస్సు ఢీ కొనడంతో మృతిచెం దాడు. మృతుడి అన్న కొడుకు ఆరుట్ల శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై రవికుమార్ తెలిపారు.